



# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 21 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 09-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

నవ మాసాలు మోసి, ఊపిరిపోసి
రూపునిచ్చిన బ్రహ్మ... అమ్మ.
కంటిపాపలా కాపాడుతూ, నన్ను జగత్తుకు
పరిచయం చేసిన ప్రత్యక్ష దైవం.
తను రక్తపు బొట్టును పాలధారగా మార్చి
పెంచిన త్యాగమూర్తి.
నా చిన్నారి నవ్వుల కోసం
తన సుఖాలను సైతం త్యాగం చేసిన కల్పవల్లి.
కష్టాల కడలిలో నన్ను కనురెప్పలా కాపాడిన
ఏకైక కరుణానిధి.
నా అడుగులకి దారి చూపిస్తూ,
ప్రగతి బాటలో నడిపిన తొలి గురువు.
తాను కన్నీరు కారుస్తూ కూడా
నా ముఖంలో ఆనందాన్ని చూసే
అమృతమూర్తి.
విశ్వమంత విస్తరించిన ప్రేమామృతాన్ని నింపిన
అపరిమిత స్నేహమూర్తి.
ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిది,
వెలకట్టలేనిది అమ్మ చూపిన అనురాగం.
కలానికి సైతం వర్ణించడానికీ అందని
పవిత్రమైన కావ్యమే... తల్లి హృదయం.

– కొయ్యడ అనిల్ కుమార్ హుస్నాబాద్,
సిద్దిపేట జిల్లా బ్యూరో చీఫ్ ..



# తెలంగాణలో ఒంటరి పోరే..
# పొత్తులకు బీజేపీ గుడ్‌బై!

- రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని బీజేపీ అధిష్ఠానం స్పష్టీకరణ
- వచ్చే ఎన్నికల్లో సొంతంగా అధికారంలోకి రావడమే లక్ష్యమని ప్రకటన
- గ్రేటర్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి
- జనసేన ఎన్డీయేలో భాగస్వామే.. తెలంగాణలో మాత్రం పొత్తు లేదని స్పష్టత
- బీజేపీ నిర్ణయంతో పవన్ కల్యాణ్ తదుపరి అడుగుపై ఆసక్తి





**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇకపై ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సొంతంగా బలపడుతూ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ నాయకత్వం వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది.

**పొత్తులు వద్దు..**
**ఒంటరి పోరే ముద్దు**

ఢిల్లీలో తెలంగాణ బీజేపీ నేతలతో జరిగిన కీలక సమావేశంలో పార్టీ భవిష్యత్ వ్యూహంపై స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణతో పాటు పంజాబ్‌లోనూ ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే ముందుకు వెళ్లాలని అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏ రాష్ట్రంలోనైనా సొంతంగా పోటీ చేసి అధికారంలోకి రావడమే బీజేపీ అంతిమ లక్ష్యమని పార్టీ నాయకత్వం స్పష్టం చేసినట్లు సమాచారం.

**బెంగాల్ ఫార్ములాపై బీజేపీ ధీమా**

పశ్చిమ బెంగాల్‌లో పొత్తులు లేకుండా పార్టీ గణనీయమైన స్థాయిలో ఎదిగిన తీరును బీజేపీ అధిష్టానం ప్రస్తావించినట్లు తెలుస్తోంది. దక్షిణాదిలోనూ ఒంటరి పోరాటం ద్వారా బలపడటం సాధ్యమేనని పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో పార్టీ క్యాడర్‌ను మరింత బలోపేతం చేసి, ప్రతి ఎన్నికను సొంత బలాన్ని పెంచుకునే

మిగతా 2లో

## ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ విచారణలో ట్విస్ట్
# సీపీపై మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు

- తనను, కుటుంబ సభ్యులను ఎన్‌కౌంటర్ చేస్తామని సీపీ సజ్జనార్ బెదిరించారని ఆరోపణ
- పోలీసుల విచారణ తీరుపై ఉప్పర్‌పల్లి మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు
- వివరణ ఇవ్వాలంటూ అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసులు
- కీలకమైన 'ఇంప్ నోట్', మొబైల్ ఫోన్‌పై పోలీసుల ఆరా
- విచారణకు ఉదయ్ సహకరించడం లేదని పోలీసుల ఆరోపణ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ విచారణ అనూహ్య మలుపు తిరిగింది. కస్టడీలో తనను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్రంగా బెదిరించారని ఆరోపిస్తూ ఉదయ్ కృష్ణారెడ్డి ఉప్పర్‌పల్లి మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనతో పాటు కుటుంబ సభ్యులను కూడా ఎన్‌కౌంటర్ చేస్తామని సీపీ బెదిరించారని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

**పోలీసుల విచారణపై మేజిస్ట్రేట్ ఆగ్రహం?**

దర్యాప్తు పేరుతో పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఉదయ్ తన ఫిర్యాదులో ఆరోపించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన మేజిస్ట్రేట్.. కస్టడీ విచారణ తీరుపై వివరణ ఇవ్వాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం కేసు

మిగతా 2లో

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు లేవు
## కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన

- యూపీఐ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు ఉండవని కేంద్రం స్పష్టం
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం
- అత్యధిక శాతం వ్యాపార లావాదేవీలు కూడా ఉచితంగానే కొనసాగింపు
- భవిష్యత్తులో ఎండీఆర్ వచ్చినా అందరిపై ఏకపక్షంగా ఉండదని వెల్లడి
- డెబిట్, క్రెడిట్ కార్డు ఎండీఆర్ కంటే తక్కువగా ఉండే అవకాశం

2లో



## రెంటల్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల వలలో పడకండి..
# సీపీ సజ్జనార్ హెచ్చరిక

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' ఆఫర్ల వెనుక సైబర్ మోసం
- ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఆకర్షణీయమైన పోస్టర్లతో యువతులకు వల
- రూ.499 నుంచి రూ.4,499 వరకు డేటింగ్ ప్యాకేజీల పేరుతో ప్రచారం
- బుకింగ్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ పేరుతో డబ్బులు వసూలు
- డబ్బులు తీసుకున్న తర్వాత అకౌంట్లు బ్లాక్ చేసి మాయం అవుతున్న సైబర్ నేరగాళ్లు



ప్రజా వాయిస్, హైదరాబాద్:సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'రెంటల్ బాయ్‌ఫ్రెండ్' ఆఫర్ల వలలో యువతులు పడొద్దని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఈ ఆఫర్ల వెనుక సైబర్ మోసాలు దాగి ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా యువతులను అప్రమత్తం చేస్తూ పోస్టు చేశారు.

**ఆకర్షణీయమైన**
**ఆఫర్లతో వల**


ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో సైబర్ నేరగాళ్లు ఆకర్షణీయమైన పోస్టర్లతో యువతులను టార్గెట్ చేస్తున్నారని సీపీ తెలిపారు. 'ఆగస్టు 1 ప్రత్యేక ఆఫర్–50 శాతం తగ్గింపు' అంటూ ప్రచారం చేస్తూ కాఫీ డేట్ రూ.499, సినిమా డేట్ రూ.1,249 వంటి ప్యాకేజీలను ప్రకటిస్తున్నారని

మిగతా 2లో

## ఒకే ఆధార్ నంబర్‌పై ఇద్దరు ఉద్యోగులు

- 40 ఆధార్ నంబర్లపై ఇద్దరు చొప్పున 80 మంది ఉద్యోగుల వివరాలు గుర్తించిన ఆర్థిక శాఖ
- రెవెన్యూ, పోలీస్ శాఖల్లో ఒకే ఆధార్‌తో వేర్వేరు ఉద్యోగులుగా నమోదు
- ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల్లో లక్షల రూపాయల వేతనాలు
- ఒక్కొక్కరు రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతనాలు పొందినట్లు గుర్తింపు

2లో




## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ



- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం
- పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.2.25 కోట్ల సాయం
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం
- తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షలు
- పిల్లల చదువు, భవిష్యత్తు బాధ్యత కూడా పార్టీదేనని కేసీఆర్ భరోసా

2లో

## సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం
# .. 49 మంది అరెస్ట్



- జూలైలో 70 ఎఫ్ఐఆర్‌లు.. 15 రాష్ట్రాలకు చెందిన 49 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- బాధితులకు రూ.98.89 లక్షలు రిఫండ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు
- 38 కేసుల్లో బాధితులకు రూ.13.87 కోట్లకు పైగా నష్టం
- అత్యధికంగా 29 మంది ట్రేడింగ్ మోసగాళ్ల అరెస్ట్
- డిజిటల్ అరెస్ట్, వాట్సాప్ డీపీ, మ్యాట్రిమోనియల్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలపై ప్రత్యేక దృష్టి

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. సాంకేతికతను అడ్డుపెట్టుకుని అమాయకుల ఖాతాల నుంచి డబ్బులు కొల్లగొడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జూలై నెలలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేపట్టి 70 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 15 రాష్ట్రాలకు చెందిన 49 మంది నిందితులను అరెస్ట్ చేశారు.

**ట్రేడింగ్ మోసాలే అత్యధికం**

అరెస్టయిన 49 మందిలో అత్యధికంగా 29 మంది ట్రేడింగ్ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా మోసాలకు ఐదుగురు, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో ముగ్గురు, వాట్సాప్ డీపీ ఫ్రాడ్‌లలో ముగ్గురు, మ్యాట్రిమోనియల్ మోసాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేశారు.వీటితో పాటు ఏపీకే లింక్ మోసం, క్రిప్టో ట్రేడింగ్, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగ మోసం, పోక్సో సంబంధిత నేరాలు, పాత నాణేల కొనుగోలు పేరుతో మోసాలకు పాల్పడిన ఒక్కొక్కరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

మిగతా 2లో

## యూపీఐ లావాదేవీలపై
# ఛార్జీలు లేవు
## కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన

**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** యూపీఐ లావాదేవీల ఛార్జీలపై కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన చేసింది. యూపీఐ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు విధించబోమని స్పష్టం చేసింది. వ్యక్తుల మధ్య జరిగే అన్ని యూపీఐ లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడించింది.

**వ్యాపార లావాదేవీలపైనా స్పష్టత**

వ్యాపారులకు సంబంధించిన అత్యధిక శాతం యూపీఐ లావాదేవీలు కూడా ఉచితంగానే కొనసాగుతాయని కేంద్రం తెలిపింది. భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమల్లోకి వచ్చినప్పటికీ.. అది అందరు వ్యాపారులపై ఏకపక్షంగా ఉండదని స్పష్టం చేసింది. ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలపైనే నామమాత్రపు ఎండీఆర్ ఉండవచ్చని పేర్కొంది.

**కార్డుల కంటే తక్కువ ఛార్జీ**

మర్చంట్ లావాదేవీలపై ఎప్పుడైనా ఎండీఆర్ విధించినా.. డెబిట్, క్రెడిట్ కార్డులపై ప్రస్తుతం ఉన్న ఎండీఆర్‌తో పోలిస్తే ఈ ఛార్జీ తక్కువగా ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది.

**లోక్‌సభ ఆమోదంతో ఆందోళన**

ఎంపిక చేసిన డిజిటల్ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలు విధించేందుకు బ్యాంకులు, చెల్లింపుల సేవా సంస్థలకు అధికారం కల్పించే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ విధింపును అడ్డుకునే పాత నిబంధనలను తొలగించారు. దీంతో భవిష్యత్తులో అన్ని యూపీఐ లావాదేవీలపైనా ఛార్జీలు పడతాయనే ఆందోళన ప్రజల్లో నెలకొంది.

**వినియోగదారులకు భరోసా**

ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టతనిస్తూ.. సాధారణ వినియోగదారులు చేసే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని తెలిపింది. వ్యక్తిగత యూపీఐ చెల్లింపులు ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది.

# సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి**

**15 రాష్ట్రాల్లో విస్తరించిన నెట్‌వర్క్**

అరెస్టయిన నిందితుల్లో తెలంగాణకు చెందిన వారు 13 మంది ఉండగా.. మహారాష్ట్ర నుంచి ఏడుగురు, రాజస్థాన్ నుంచి ఆరుగురు, పశ్చిమ బెంగాల్ నుంచి ఐదుగురు, ఉత్తరప్రదేశ్ నుంచి నలుగురు, బీహార్ నుంచి ముగ్గురు ఉన్నారు. ఢిల్లీ, హర్యానా, జార్ఖండ్ నుంచి ఇద్దరేసి చొప్పున, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**భారీగా పరికరాలు స్వాధీనం**

నిందితుల నుంచి 25 డెబిట్ కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 9 చెక్‌బుక్కులు, 7 బ్యాంకు పాస్‌బుక్కులు, 5 రబ్బర్ స్టాంపులు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 పాన్ కార్డులు, 2 రెంటల్ అగ్రిమెంట్లు, ఒక యూఏఈ రెసిడెంట్ ఐడీ కార్డు, ఒక క్రెడిట్ కార్డు, ఒక పాస్‌పోర్టును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ.13.87 కోట్ల నష్టం..**
**రూ.98.89 లక్షలు రికవరీ**

జూలైలో నమోదైన 38 కేసుల్లో బాధితులు మొత్తం రూ.13,87,18,283 నష్టపోయినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో రూ.98,89,202లను రికవరీ చేసి బాధితులకు తిరిగి ఇప్పించారు.ట్రేడింగ్ మోసాలకు సంబంధించి 25 కేసుల్లో బాధితులు రూ.11,75,83,416 నష్టపోగా.. రూ.58,23,217 రిఫండ్ చేయించారు. ఏపీకే మోసంలో రూ.8.75 లక్షలకు పైగా, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో రూ.12.78 లక్షలు, క్రెడిట్ కార్డు మోసంలో రూ.5.14 లక్షలు రికవరీ చేశారు. డిజిటల్ అరెస్ట్, కస్టమర్ కేర్, ఉద్యోగ మోసం, వాట్సాప్ డీపీ ఫ్రాడ్ కేసుల్లోనూ బాధితులకు నగదు తిరిగి ఇప్పించారు.

**2,059 పిటిషన్లు.. 298 ఎఫ్ఐఆర్‌లు**

జోనల్ సైబర్ సెల్స్ పరిధిలో జూలైలో 2,059 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో 298 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ఐదు కేసుల్లో ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసుల్లో రూ.27,09,320 నగదును రికవరీ చేసి బాధితులకు రిఫండ్ చేయించారు.

**128 నకిలీ ప్రొఫైళ్లు..**
**36 పెయిడ్ యాడ్లు బ్లాక్**

సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు నిరంతరం సైబర్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. జూలైలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అశ్లీల కంటెంట్, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్లను ప్రచారం చేస్తున్న 128 ప్రొఫైళ్లు, 36 పెయిడ్ యాడ్లను గుర్తించి బ్లాక్ చేయించారు. ఇప్పటి వరకు 1,086 ప్రొఫైళ్లు, 2,553 ప్రకటనలను తొలగించి 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

**వాట్సాప్ ఖాతా హ్యాక్ చేసి**
**రూ.25 లక్షలు కాజేసిన కేసు ఛేదన**

భూమి బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన వాట్సాప్ ఖాతాను హ్యాక్ చేసి ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.25 లక్షలు కాజేసిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో బీహార్‌కు చెందిన అభినందన్ కుమార్ కామత్‌ను హర్యానాలోని గురుగ్రామ్‌లో అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు మొబైల్ ఫోన్లు, మూడు డెబిట్ కార్డులు, నాలుగు పాస్‌బుక్కులు, రెండు స్టాంపులు, రెండు పాన్ కార్డులు, రెండు ఒరిజినల్ రెంటల్ అగ్రిమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

**1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి**

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్, క్రైమ్స్ అండ్ ఎస్ఐటీ అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, లేదా [జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్] (https://www.cybercrime.gov.in) ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట..
# హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు భారీగా తరలివచ్చిన నిరుద్యోగులు

- **హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి రిక్రూట్‌మెంట్**
- **తెల్లవారుజామున 4 గంటల నుంచే స్టేడియానికి చేరుకున్న వేలాది మంది**
- **భారీగా తరలిరావడంతో కిక్కిరిసిన సరూర్‌నగర్ స్టేడియం**
- **సరైన ఏర్పాట్లు లేకపోవడంపై నిరుద్యోగుల ఆందోళన**
- **పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు.. అభ్యర్థులకు టోకెన్లు**

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద శనివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహిస్తున్న రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పాల్గొనేందుకు వేలాది మంది నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. శని, ఆదివారాల్లో ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు హైడ్రా ప్రకటించడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**తెల్లవారుజామున 4 గంటల నుంచే క్యూ**

డ్రైవర్ పోస్టుల కోసం నిర్వహిస్తున్న ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు అభ్యర్థులు తెల్లవారుజామున 4 గంటల నుంచే సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు మాత్రమే ఉండటంతో భారీ పోటీ నెలకొంది. ఊహించిన దానికంటే ఎక్కువ మంది తరలిరావడంతో స్టేడియం పరిసరాలు నిరుద్యోగులతో కిక్కిరిసిపోయాయి.

**సౌకర్యాలు లేక అభ్యర్థుల ఆగ్రహం**

గంటల తరబడి క్యూలలో వేచి ఉన్నప్పటికీ అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని వాపోయారు. జిల్లాలు దాటి ఉద్యోగం కోసం వస్తే కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయకపోవడం ఏమిటంటూ నిర్వాహకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**పోలీసుల రంగప్రవేశం.. పరిస్థితి అదుపులోకి**

అభ్యర్థుల ఆందోళన, తోపులాట నేపథ్యంలో స్థానిక పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి రద్దీని నియంత్రించారు. అనంతరం అభ్యర్థులకు టోకెన్లు అందజేసి వెనక్కి పంపిస్తున్నట్లు సమాచారం.

**టోకెన్‌లోని సమయం ప్రకారం**
**రావాలని సూచన**

టోకెన్‌పై పేర్కొన్న సమయం ప్రకారం అభ్యర్థులు తిరిగి సరూర్‌నగర్ స్టేడియానికి వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. భారీగా అభ్యర్థులు తరలిరావడంతో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ నిర్వహణపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## రెంటల్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల వలలో పడకండి..
# సీపీ సజ్జనార్ హెచ్చరిక

**మొదటి పేజీ తరువాయి**

పేర్కొన్నారు.

**రూ.4,499 ఫుల్ డే ప్యాకేజీ**

షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లకు తోడుగా వస్తామంటూ వివిధ ధరలతో ఆఫర్లు ఇస్తున్నారని తెలిపారు. 10 గంటల పూర్తి రోజు ప్యాకేజీ రూ.4,499 అంటూ ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. కృత్రిమ మేధతో రూపొందించిన లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన యువకుల ఫొటోలతో నకిలీ ప్రొఫైళ్లను సృష్టిస్తున్నారని చెప్పారు.

**ముందుగా డబ్బులు**
**వసూలు చేసి మోసం**

ఈ ప్రకటనలకు స్పందించిన యువతులతో సైబర్ నేరగాళ్లు మధురమైన మాటలతో చాటింగ్ చేస్తారని, ఆ తర్వాత అసలు మోసానికి తెరతీస్తారని సజ్జనార్ తెలిపారు. బుకింగ్ నిర్ధారణ, భద్రతా డిపాజిట్, ముందస్తు చెల్లింపు వంటి పేర్లతో డబ్బులు వసూలు చేస్తారని చెప్పారు. డిజిటల్ వాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు దోచుకుంటున్నారని వెల్లడించారు.

**డబ్బులు తీసుకున్నాక బ్లాక్.. ఆపై బ్లాక్‌మెయిల్**

డబ్బులు తీసుకున్న తర్వాత ఖాతాలను బ్లాక్ చేసి సైబర్ నేరగాళ్లు మాయమవుతున్నారని సీపీ హెచ్చరించారు. చాటింగ్ సమయంలో సేకరించిన ఫోన్ నంబర్లు, ఫొటోలు, వ్యక్తిగత సమాచారంతో అనంతరం బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. అపరిచిత వ్యక్తులను నమ్మి నేరుగా కలిస్తే మరింత ప్రమాదకరమైన పరిస్థితుల్లో చిక్కుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ముందస్తుగా**
**ఒక్క రూపాయి కూడా చెల్లించొద్దు**

ఇలాంటి మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి ముందస్తుగా ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవడం చేయొద్దని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగం, ఆన్‌లైన్ పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ విచారణలో ట్విస్ట్
# సీపీపై మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు



**మొదటి పేజీ తరువాయి**

దర్యాప్తులో కీలకంగా మారింది.

**'ఇంప్ నోట్'పై సీపీ ఆరా**

కస్టడీ విచారణలో ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసులకు సహకరించడం లేదని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీపీ సజ్జనార్ స్వయంగా అతడిని విచారించినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో పోలీసులకు కీలకమైన 'ఇంప్ నోట్' లభించినట్లు తెలుస్తోంది. అందులో బాధితురాలికి సంబంధించిన వ్యవహారాలు, వేధింపులకు సంబంధించిన కీలక వివరాలు ఉన్నట్లు సమాచారం. ఈ నోట్ వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనే అంశంపై సీపీ నిందితుడిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

**కీలక మొబైల్ కోసం పోలీసుల ఆరా**

కేసులో మరో కీలక ఆధారంగా భావిస్తున్న మొబైల్ ఫోన్ కోసం పోలీసులు ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. బాధితురాలికి సంబంధించిన వీడియోలు ఆ ఫోన్‌లో ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. ఫోన్‌ను ఎక్కడ దాచారనే విషయంపై ఉదయ్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నప్పటికీ.. అతడు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని తెలుస్తోంది.

**దర్యాప్తు అధికారులతో సహకరించడం లేదని ఆరోపణ**

కస్టడీలో తనను ప్రశ్నిస్తున్న సీఐ, ఎస్సై స్థాయి అధికారులతో ఉదయ్ కృష్ణారెడ్డి సహకరించడం లేదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. విచారణ సందర్భంగా దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు దాటవేస్తున్నట్లు సమాచారం. దీంతో కీలక ఆధారాలను సేకరించడం పోలీసులకు సవాల్‌గా మారినట్లు తెలుస్తోంది.

**లైంగిక వేధింపుల కేసులో కీలక ఆధారాలపై దృష్టి**

కర్ణాటకకు చెందిన 30 ఏళ్ల మహిళా ట్రైనీ అధికారిణికి అసభ్యకర సందేశాలు పంపడం, ఆమెకు సంబంధించిన వీడియోలతో బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులో మొబైల్ ఫోన్, 'ఇంప్ నోట్'తో పాటు ఇతర డిజిటల్ ఆధారాలు కీలకంగా మారాయి. కస్టడీ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా దర్యాప్తు తదుపరి దశకు వెళ్లే అవకాశం ఉంది.

# ఒకే ఆధార్ నంబర్‌పై ఇద్దరు ఉద్యోగులు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల చెల్లింపుల్లో ఆసక్తికరమైన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగిగా ఉన్న ఓ వ్యక్తి నెలకు రూ.లక్షకు పైగా వేతనం పొందుతుండగా.. అదే ఆధార్ నంబర్‌తో పోలీస్ శాఖలో మరో ఉద్యోగి నెలకు రూ.1.50 లక్షలకు పైగా వేతనం పొందుతున్నట్లు ఆర్థిక శాఖ గుర్తించినట్లు సమాచారం. ఇద్దరి పేర్లు, ఉద్యోగ వివరాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ఆధార్ నంబర్ మాత్రం ఒకటే కావడం అధికారులను విస్మయానికి గురిచేసింది.

**40 ఆధార్ నంబర్లు.. 80 మంది ఉద్యోగులు**

ఈ తరహా వ్యవహారం ఒకరిద్దరితోనే పరిమితం కాలేదని తెలుస్తోంది. మొత్తం 40 ఆధార్ నంబర్లపై ఇద్దరు చొప్పున 80 మంది ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ఆర్థిక శాఖ గుర్తించినట్లు సమాచారం. వారంతా రెగ్యులర్ ఉద్యోగులుగా నమోదై ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**మూడు నెలల్లో లక్షల రూపాయల వేతనాలు**

ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలంలో ఈ ఉద్యోగులకు వేతనాల రూపంలో భారీ మొత్తాలు చెల్లించినట్లు పరిశీలనలో తేలింది. ఒక్కొక్కరు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతనాల కింద పొందినట్లు గుర్తించినట్లు సమాచారం.

**రెండు శాఖల్లో ఒకే ఆధార్ ఎలా?**

ఒకే ఆధార్ నంబర్‌పై ఇద్దరు వేర్వేరు వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులుగా ఎలా నమోదయ్యారు? ఒకే వ్యక్తి పేరుతో రెండు శాఖల్లో వేతనాలు డ్రా అయ్యాయా? లేక ఉద్యోగుల వివరాల నమోదు, వేతనాల బిల్లుల తయారీలో సాంకేతిక లోపాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**విచారణతో మరిన్ని వివరాలు**
**వెలుగులోకి వచ్చే అవకాశం**

ఒకే ఆధార్ నంబర్‌కు ఇద్దరు ఉద్యోగుల వివరాలు అనుసంధానం కావడంపై ఆర్థిక శాఖ మరింత లోతుగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఖజానా నుంచి ఎంత మొత్తంలో వేతనాలు చెల్లించబడ్డాయి? ఈ వ్యవహారంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడ్డారా? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిగితే మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కేసీఆర్ నిర్ణయించారు. కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి**

పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున మొత్తం రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కేసీఆర్ నిర్ణయించారు. పిల్లల భవిష్యత్తు, విద్య తదితర అవసరాలకు ఈ మొత్తం ఉపయోగపడేలా పార్టీ అండగా నిలవనుంది.

**అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షలు**

పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున ఆమె బాగోగులు, కుటుంబ అవసరాల కోసం మరో రూ.25 లక్షలు అందించాలని కేసీఆర్ నిర్ణయించారు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

**పార్టీ నిరంతరం అండగా ఉంటుంది**

పెద్ది కుటుంబానికి ఆర్థిక సాయంతో మాత్రమే పరిమితం కాకుండా పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**దశదినకర్మల అనంతరం**
**భవిష్యత్ కార్యాచరణ**

పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు పూర్తయిన అనంతరం వరంగల్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై ఆయన కుటుంబ సంక్షేమానికి సంబంధించిన తదుపరి నిర్ణయాలు తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎల్లకాలం పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

## తెలంగాణలో ఒంటరి పోరే..
# పొత్తులకు బీజేపీ గుడ్‌బై!

**మొదటి పేజీ తరువాయి**

అవకాశంగా మలచుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

**గ్రేటర్ ఎన్నికల్లో**
**ఒంటరిగానే పోటీ**

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు కూడా పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ప్రకటించారు. జనసేనతో జాతీయ స్థాయిలో పొత్తు ఉన్నప్పటికీ.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని తేల్చి చెప్పారు.

**జనసేనపై నిర్ణయం అధిష్టానానిదే**

జనసేన ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నప్పటికీ తెలంగాణలో బీజేపీ సొంతంగానే పోటీ చేస్తుందని రామచంద్రరావు స్పష్టం చేసినట్లు సమాచారం. జనసేనతో సంబంధిత అంశాలను పార్టీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందని తెలిపారు. ఏపీ తరహా పొత్తుల ఫార్ములాను తెలంగాణలో అమలు చేయకూడదని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**పవన్ కల్యాణ్ నిర్ణయంపై ఉత్కంఠ**

మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల కోసం జనసేన ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓటర్లు గణనీయంగా ఉన్న నేపథ్యంలో బీజేపీతో కలిసి పోటీ చేస్తే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని జనసేన అంచనా వేసినట్లు సమాచారం. అయితే బీజేపీ తాజాగా ఒంటరి పోరుపై స్పష్టత ఇవ్వడంతో.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదుపరి నిర్ణయం ఏంటనేది ఆసక్తికరంగా మారింది.








# హక్కుల కోసం సమర శంఖం

- ఆగస్టు 10న హుజూర్‌నగర్‌లో జైల్ భరో కార్యక్రమం
- కార్మికులు భారీగా తరలిరావాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా పిలుపు

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్**, ఆగస్టు 8కార్మికుల హక్కులు,సంక్షేమాన్ని పరిరక్షించేందుకు ఆగస్టు 10న హుజూర్‌నగర్‌లో నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం హుజూర్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా పిలుపు నిచ్చారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ ఉద్యమంలో హుజూర్‌నగర్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు.కార్మిక సంక్షేమ బోర్డు నిధులను పరిరక్షించాలని, సీసీసీ ఆరోగ్య పథకాలను రద్దు చేయాలని, జీవో నం.12ను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరారు. కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలని, పెన్షన్, ఈఎస్ఐ,పీఎఫ్ తో పాటు ఇళ్ల నిర్మాణానికి, పిల్లల విద్యకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల శ్రమతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతున్నప్పటికీ వారి సంక్షేమం, హక్కుల విషయంలో నిర్లక్ష్యం తగదని షేక్ ముస్తఫా అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 10న హుజూర్‌నగర్‌లో జరిగే జైలు భరో కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

- 80 గ్రాముల బంగారం.. 91 గ్రాముల వెండి రికవరీ



**ప్రజా వాయిస్ దౌల్తాబాద్:** దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి చోరీకి గురైన 80 గ్రాముల బంగారు ఆభరణాలు, 91 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింలు తెలిపారు.దౌల్తాబాద్ గ్రామానికి చెందిన రామొల్ల శ్రీలేఖ (25)కు రెండు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన రామొల్ల శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో శ్రీలేఖ తల్లిదండ్రులు 80 గ్రాముల బంగారు ఆభరణాలను అందజేశారు. శ్రీలేఖ మామ రామొల్ల మల్లేశం చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి దౌల్తాబాద్‌లో నివసిస్తున్నారు.సుమారు నెల రోజుల క్రితం శ్రీలేఖ, ఆమె కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి తల్లి ఇంటికి వెళ్లారు. ఆగస్టు 6న తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోని బీరువాలో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో అదే రోజు దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడిగా అదే గ్రామానికి చెందిన గుండెకాయ స్వామి (44)ని అదుపులోకి తీసుకుని విచారించారు. మల్లేశం వద్ద నిందితుడు చిట్టీ వేసి ఉండటంతో చిట్టీ డబ్బులు చెల్లించేందుకు తరచూ అతడి ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో మల్లేశం డబ్బులను బీరువాలో భద్రపరచడం, బీరువా తాళం ఎక్కడ ఉంచుతున్నారనే విషయాలను నిందితుడు పలుమార్లు గమనించినట్లు పోలీసులు తెలిపారు.చిట్టీ డబ్బులు, బంగారు ఆభరణాలు బీరువాలోనే ఉంటాయని భావించిన నిందితుడు జల్సాలకు డబ్బులు అవసరం కావడంతో చోరీకి పథకం వేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆగస్టు 2న అర్ధరాత్రి సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. ముందుగా గమనించిన తాళాల సహాయంతో బీరువా, లాకర్ తెరిచి అందులో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశాడు.చోరీ చేసిన ఆభరణాలను ఎవరికీ కనిపించకుండా తన ఇంటి ముందు ఉన్న రాళ్లకుప్ప కింద దాచిపెట్టినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. రాళ్లకుప్ప కింద దాచిన మొత్తం చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.కేసును సకాలంలో ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తును రికవరీ చేసిన తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది ప్రశాంతి, శ్రీకాంత్, ప్రవీణ్, మహమ్మద్ షఫీలను ఏసీపీ అభినందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.





# బెల్టు దుకాణాలపై మహిళల కన్నెర్ర

- ఉమ్మడి జిల్లాలో భగ్గుమన్న ఆందోళనలు!
- మద్యం మత్తులో అరాచకాలు.. మహిళలపై దాడులు
- సహనం నశించి రోడ్డెక్కిన వైనం

**ప్రజా వాయిస్/ ఉమ్మడి ఆదిలాబాద్** జిల్లాసమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, కుటుంబాలను రోడ్డున పడేస్తున్న అక్రమ బెల్టు దుకాణాలపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో జరుగుతున్న గొడవలు, ఇళ్లలో మహిళలపై పెరుగుతున్న దాడులతో విసిగిపోయిన ఆడపడుచులు ఎట్టకేలకు తిరగబడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో బెల్టు షాపులను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు.రెబ్బెన మండలం.గంగాపూర్‌వాంకిడి మండలం సోనాపూర్‌కెరమెరి మండలం అగుర్వాడ సిర్పూర్ (టి) మండలం వేంపల్లిగ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న నాటు, బెల్టు మద్యం విక్రయాల వల్ల యువత పెడదోవ పడుతోందని, సాయంత్రం అయితే చాలు ఇళ్లలో శాంతి కరువవుతోందని మహిళలు వాపోతున్నారు. మద్యం సేవించి వస్తున్న వారు వీరంగం సృష్టిస్తూ, మహిళలపై భౌతిక దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు.దీనికి పరాకాష్టగా, రెండ్రోజుల క్రితం కెరమెరి మండలం అగుర్వాడలో మహిళలాగ్రహం కట్టలు తెంచుకుంది. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపైకి దూసుకెళ్లిన మహిళలు, అక్కడ నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను నేలకేసి కొట్టి ధ్వంసం చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.ఇప్పటికైనా సంబంధిత ఎక్సైజ్ మరియు పోలీసు అధికారులు స్పందించి, గ్రామాల్లోని ప్రతి అక్రమ బెల్టు దుకాణాన్ని శాశ్వతంగా మూసివేయించాలని, లేనిచో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని మహిళలు హెచ్చరిస్తున్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక రాజకీయ వేధింపులా..?

- భార్య సర్పంచ్ కావడంతో గ్రామ అభివృద్ధి పనుల్లో భర్త సహకరిస్తే తప్పేంటి..?
- రాజకీయ కక్షతోనే జోగిపేట సీఐ పేరుతో ఎస్పీకి ఫిర్యాదు చేశారంటున్న కృష్ణారెడ్డి
- ఆర్టీవో కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయానికి బదిలీ
- బెదిరింపులకు భయపడను.. గ్రామాభివృద్ధే లక్ష్యం: కృష్ణారెడ్డి





**ప్రజా వాయిస్, సంగారెడ్డి**. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల కేంద్రమైన పుల్కల్ గ్రామ సర్పంచ్ పదవి మహిళకు రిజర్వు కావడంతో గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తన సతీమణి లావణ్యను సర్పంచ్‌గా పోటీలో నిలిపారు. ఎన్నికలకు ముందునుంచే గ్రామంలోని ప్రజలతో మమేకమై, అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తున్న కృష్ణారెడ్డి గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు.గ్రామంలోని అధ్వానంగా ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారులను సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తానని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చినట్లు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో ఆడపిల్ల వివాహం జరిగితే తులం బంగారం అందించాలనే ఉద్దేశంతో ధరలు పెరిగిన నేపథ్యంలో రూ.16 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అలాగే గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5 వేల ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాకపోయినా ఇప్పటివరకు దాదాపు రూ.25 లక్షల సొంత నిధులతో వ్యవసాయ రహదారుల మరమ్మతులు చేపట్టినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం తాను చేస్తున్న కార్యక్రమాలను కొందరు రాజకీయంగా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఇటీవల మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పుల్కల్ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించిన సందర్భంలో తాను అక్కడ ఉన్నానని కృష్ణారెడ్డి తెలిపారు. అప్పటివరకు పోలీసుశాఖలోని ఆర్టీవో కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న తనపై రాజకీయ కక్షతో జోగిపేట సీఐ పేరుతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయించి, అక్కడి నుంచి బదిలీ చేయించారని ఆరోపించారు.తనపై ఎన్ని రాజకీయ వేధింపులు చేసినా భయపడేది లేదని కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం తాను దేనికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గత ఆరు నెలలుగా గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన ఖర్చుల వివరాలను పరిశీలించి తనపై విమర్శలు చేస్తున్న రాజకీయ పార్టీల నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు."గ్రామం అనేది మన ఇంటి లాంటిది. గ్రామాన్ని అభివృద్ధి చేసే వారికి సహకరించాలి. విమర్శలతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు. గ్రామాభివృద్ధే నా లక్ష్యం" అని కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# పాత పద్ధతిలోనే ఏఈఓలకు ఇన్-సర్వీస్ బీఎస్సీ అవకాశం ఇవ్వాలి

- సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక చేయాలి
- 5 శాతం ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలి
- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌కు ఏఈఓల సంఘం వినతి

**ప్రజా వాయిస్,నల్లగొండ**.ఇన్–సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్) ప్రవేశాల్లో పాత విధానాన్ని కొనసాగిస్తూ ఏఈఓలను సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక చేయాలని నల్లగొండ జిల్లా ఏఈఓల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర సెంట్రల్ ఫోరం సూచనల మేరకు ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఇన్–సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ శాసన మండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్‌కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. జి.ఓ.ఎం.ఎస్. నెం.250, తేదీ 06.10.2009 స్ఫూర్తికి అనుగుణంగా డిప్లొమా అర్హత కలిగిన ఏఈఓలకు ఇన్–సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్)లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న విధానం కారణంగా సీనియర్ ఏఈఓలు అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జి.ఓ. నెం.250 లక్ష్యం, స్ఫూర్తి దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.గత విద్యా సంవత్సరంలో 31 మంది ఏఈఓలకు ఇన్–సర్వీస్ బీఎస్సీకి అవకాశం కల్పించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో కేవలం 19 సీట్లు మాత్రమే కేటాయించడం వల్ల పలువురు అర్హులైన ఏఈఓలు నష్టపోతున్నారని తెలిపారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇస్తూ గతంలో అమలు చేసిన విధానాన్నే కొనసాగించాలని కోరారు.అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఇన్–సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేసి, అర్హత కలిగిన ఏఈఓలకు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏఈఓలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో TNGO అనుబంధ సంఘం TAEOA జిల్లా అధ్యక్షులు అమరాజు లింగయ్య, జిల్లా కార్యదర్శి మాలావత్ రమేష్‌తో పాటు పలువురు ఏఈఓలు పాల్గొన్నారు.



# అస్తవ్యస్తంగా ఎన్ హెచ్ ఎం. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు ప్రభుత్వ జీతాలు తీసుకొని

- ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుల సేవలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
- రోగుల ఇక్కట్లు

**ప్రజా వాయిస్ హన్మకొండ** /పరకాల కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు రోగాల బారిన పడకుండా కోట్లు వెచ్చించి. కార్యాలయలతో పాటు వైద్య సిబ్బందిని నియమించి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైద్య కార్యాలయాలు ఆదిలోనే హంసపాదిలా తయారయ్యాయి. ప్రభుత్వాల నుండి జీతాలు తీసుకుని రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వైద్యులు ప్రభుత్వాల నుండి జీతాలు తీసుకుని ప్రైవేటు ఆసుపత్రిలో తిష్ట వేసి దండిగానే దండుకుంటున్నట్లు రోగులు బహిర్గతంగా ఆరోపించడం పరకాల పట్టణ కేంద్రంలో చర్చనీయాంశమైంది. పరకాల పట్టణ కేంద్రంలోని నేషనల్ హెల్త్ మిషన్ ( బ్లడ్ బ్యాంక్ ) కేంద్ర ప్రభుత్వం ద్వారా కొనసాగుతుంది. వైద్య విధాన పరిషత్తు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనసాగుతుంది. పరకాల పట్టణ కేంద్రంతో పాటు వివిధ మండలాలు గ్రామాల నుండి రోగులు ప్రతిరోజు వందల్లో హాజరై. వారి రోగాన్ని నయం చేసుకోవడానికి వస్తారు. అన్నీ ఉండి అల్లుడు నోట్లో శని ఉంది అన్నట్లుగా ఇక్కడ కొందరు వైద్యులు వచ్చి రిజిస్టర్లో సంతకాలు పెట్టుకుని వెళ్లిపోవడం ప్రైవేటు ఆసుపత్రిలో సేవలు అందించడం కొంత కాలంగా పరిపాటిగా కొనసాగుతుందని. రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం రోగాల పాలిట శాపంగా మారిందని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైద్యులను తొలగించి రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించే వైద్యులను నియమించాలని జిల్లా కలెక్టర్. స్థానిక శాసనసభ్యులను వేడుకుంటున్న పట్టణవాసులు వివిధ మండలాలు గ్రామాల నుండి వచ్చే రోగులు వేడుకుంటున్నారు.



# రవీంద్రఖనిలో 'బల్లారిషా' రైలు ఆపాల్సిందే

- మందమర్రి స్టాప్‌తో ప్రయోజనం ఏంటి?
- 15 కి.మీ. దూరంలోని మంచిర్యాలకు వెళ్లే పరిస్థితి
- రవీంద్రఖని ప్రాంతంలో సింగరేణి బొగ్గు గనులు, వాణిజ్య కేంద్రాలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది
- ఇక్కడ స్టాప్ కల్పించడం ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యంతో పాటు రైల్వే శాఖకు కూడా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.
- ఎంపీ వంశీకృష్ణ చొరవ చూపాలని ప్రజల విజ్ఞప్తి



**ప్రజా వాయిస్/ రామకృష్ణాపూర్** మంచిర్యాల జిల్లా కేంద్రంలో రామకృష్ణాపూర్ కాజీపేట–బల్లారిషా మార్గంలో నడిచే సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైలుకు రామకృష్ణాపూర్‌లోని రవీంద్రఖని రైల్వే స్టేషన్‌లో స్టాపేజ్ కల్పించాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులకు కీలకంగా ఉన్న రవీంద్రఖని స్టేషన్‌లో ఈ రైలుకు నిలుపుదల లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రస్తుతం ఈ రైలుకు సమీపంలోని మందమర్రిలో స్టాపేజ్ కల్పించినప్పటికీ, దాని వల్ల రామకృష్ణాపూర్ ప్రాంత ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేదని వారు అంటున్నారు. మందమర్రి పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ప్రయాణికులు సైతం రైలు ఎక్కడానికి రవీంద్రఖని స్టేషన్‌కు రావాల్సి వస్తోందని, అలాంటి పరిస్థితుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న రవీంద్రఖని స్టేషన్‌ను విస్మరించడం సమంజసం కాదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రామకృష్ణాపూర్ ప్రాంతం సింగరేణి బొగ్గు గనులతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. రవీంద్రఖని రైల్వే స్టేషన్ నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి కీలక స్టేషన్‌లో కాజీపేట–బల్లారిషా రైలుకు స్టాపేజ్ కల్పిస్తే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు రైల్వే శాఖకు కూడా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

### అర్ధరాత్రి మంచిర్యాలకు వెళ్లాల్సిన దుస్థితి

రైలు సమయాల కారణంగా ప్రయాణికుల సమస్య మరింత తీవ్రంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాజీపేట నుంచి బయలుదేరే ఈ రైలు అర్ధరాత్రి సమయంలో మంచిర్యాలలో నిలిచే పరిస్థితి ఉండటంతో రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన ప్రయాణికులు అక్కడే దిగాల్సి వస్తోంది. రామకృష్ణాపూర్‌కు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల నుంచి అర్ధరాత్రి సమయంలో స్వగ్రామానికి చేరుకోవడం మహిళలు, వృద్ధులు, కుటుంబాలతో ప్రయాణించే వారికి తీవ్ర ఇబ్బందిగా మారుతోందని పేర్కొంటున్నారు.అర్ధరాత్రి వేళ మంచిర్యాల నుంచి రామకృష్ణాపూర్ కు సరైన ప్రజా రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమయంలో ఆటోలను ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సి రావడం, అధిక మొత్తంలో చార్జీలు చెల్లించాల్సి రావడం తమకు ఆర్థిక భారంగా మారుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు అర్ధరాత్రి వేళ రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడటమే కాకుండా భద్రతపైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఎంపీ వంశీకృష్ణ చొరవ చూపాలని డిమాండ్

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలపై స్పందించే ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని రామకృష్ణాపూర్ ప్రజలు కోరుతున్నారు. రవీంద్రఖని స్టేషన్‌కు ఉన్న ప్రాధాన్యత, ప్రయాణికుల రద్దీ, సింగరేణి కార్మికుల అవసరాలు, అర్ధరాత్రి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కాజీపేట–బల్లారిషా రైలుకు రవీంద్రఖనిలో స్టాపేజ్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రైల్వే శాఖ కూడా కేవలం స్టేషన్ పేరును పరిగణనలోకి తీసుకోకుండా ఆయా ప్రాంతాల వాస్తవ ప్రయాణికుల అవసరాలు, రద్దీ, ఆదాయ అవకాశాలు, ప్రజల భద్రత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. రవీంద్రఖనిలో స్టాపేజ్ కల్పించడం ద్వారా రామకృష్ణాపూర్‌తో పాటు పరిసర గ్రామాలు, సింగరేణి ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు.ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా మధ్య మార్గంలో రవీంద్రఖనిలో రైలును నిలిపితే ప్రయాణికులకు సౌకర్యం కలగడంతో పాటు రైల్వే శాఖకు కూడా ఆదాయం పెరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల దీర్ఘకాలిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర రైల్వే శాఖ, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కాజీపేట–బల్లారిషా సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైలుకు రామకృష్ణాపూర్ (రవీంద్రఖని) స్టేషన్‌లో స్టాపేజ్ మంజూరు చేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# డబుల్ బెడ్ రూమ్ లకు వీడని గ్రహణం

- జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన పంపిణీకి నోచుకోని వైనం
- జిల్లా కేంద్రంలో సైతం అదే తీరు -
- ప్రజాధనం నిరుపేయోగం



**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో గత టీఆర్ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసింది. ఇండ్ల నిర్మాణం పూర్తయి దాదాపు ఐదున్నర సంవత్సరాలు దాటిన అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేయలేని దుస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉంది. ఫలితంగా నిరుపేదలకు ఇవ్వకపోవడంతో దిష్టిబొమ్మల దర్శనం ఇవ్వడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిపోతున్నాయి. సంగారెడ్డి మండలం హనుమాన్ నాయక్ తాండ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారిలో ఇండిపెండెంట్ డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం చేశారు. దురదృష్టమో అదృష్టమో తెలియదు కానీ 2019లో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంగారెడ్డి నుంచి మాత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా జగ్గారెడ్డి గెలిచాడు. ఆ సమయంలో నిర్మాణాలు పూర్తయినప్పటికీ ప్రభుత్వం తమది కాదన్న ఉద్దేశంతో ప్రారంభించ దానికి ఆసక్తి చూపలేదని జగ్గారెడ్డి పై అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. 2014 ఎన్నికల్లో గెలిచిన జగ్గారెడ్డి కొండాపూర్ మండలం అలియాబాద్ లో సుమారు 1000 మందికి ఇళ్ల స్థలాల పంపిణీకి పట్టా సర్టిఫికెట్లను సైతం ఇచ్చారు. కానీ అక్కడ బాధితులకు ఇండ్ల స్థలాలు చూపించకపోవడం కాకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేకపోవడంతో జగ్గారెడ్డి ఇచ్చిన సర్టిఫికెట్లు దేనికి పనికి రాకుండా పోయాయి. కానీ హనుమాన్ నాయక్ తండా సమీపంలో నిర్మించిన ఇండిపెండెంట్ ఇల్లు పేదలకు ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అందోల్ నియోజకవర్గం లోని మండల కేంద్రమైన పుల్కల్లో గత ఐదు సంవత్సరాల క్రితం ఇండ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారుల ఎంపిక సైతం జరిగింది. కానీ డబుల్ బెడ్ రూమ్ కు విద్యుత్ సరఫరాతో పాటు త్రాగునీటి సౌకర్యాలు లేని కారణంగా అప్పట్లో పంపిణీ చేయలేకపోయారు. ప్రభుత్వం ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్పర్ ను ఏర్పాటు చేయడంతో పాటు నీటి వసతిని కూడా కల్పించారు. లబ్ధిదారుల పంపిణీ చేసే సమయానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. గంతే ఇప్పటికి దాదాపు రెండున్నర సంవత్సరాలు అయినా జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ బెడ్రూంలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సింగరేణి బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

- రిటైర్డ్ కార్మికుల పిల్లల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సంఘీభావం



**ప్రజా వాయిస్ రామగుండం** సింగరేణి రిటైర్డ్ కార్మికుల పిల్లలు ఎదుర్కొంటున్న మారుపేర్లు (అలియాస్), పెండింగ్ విజిలెన్స్ కేసుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలు చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని సందర్శించి బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధికి రక్తాన్ని చెమటగా మార్చిన రిటైర్డ్ కార్మికుల పిల్లలు సాంకేతిక లోపాలు, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న విజిలెన్స్ కేసుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, బాధితుల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేకల సమ్మయ్య యాదవ్,తోకల శామని రమేష్, నారాయణదాసు మారుతి, నాయకులు మెతుకు దేవరాజు, మేడి సదానందం, దొమ్మటి వాసు, కొలుగూరి సాయికుమార్, నమ్తాబాద్ కిరణ్, ఇరుగురాల శ్రావణ్, ఈదునూరి శ్రీకాంత్, నూతి తిరుపతి, రామ్‌రాజ్, అల్లం ఐలయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి హామీలు ఎక్కడ..?

- సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గ్రామాల్లో ఎక్కడ..?
- ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు.. ఇప్పుడు అభివృద్ధి జాడేది..?
- మురుగు కాలువలు, తాగునీటి సమస్యలతో ప్రజల ఇబ్బందులు
- మహిళా సర్పంచుల స్థానంలో భర్తల పెత్తనంపై ప్రజల ఆవేదన

**ప్రజా వాయిస్, దుబ్బాక.** సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవి కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన అభ్యర్థులు, ఎన్నికల సమయంలో గ్రామాల అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చారని, ఎన్నికలు ముగిసిన తర్వాత వాటి అమలుపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.గ్రామాల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు పెద్దగా స్పందించిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. పలు గ్రామాల్లో మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. గ్రామాల అభివృద్ధి ఎందుకు వెనుకబడిందో అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని కోరుతున్నారు.మరోవైపు కొన్ని గ్రామాల్లో మహిళలు సర్పంచులుగా ఎన్నికైనప్పటికీ వారి భర్తల పెత్తనం కొనసాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమస్యలపై మాట్లాడేందుకు సర్పంచులను సంప్రదించాల్సి ఉండగా, కొన్నిచోట్ల సర్పంచుల భర్తలే ముందుకు వస్తున్నారని అంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ వేదికగా సర్పంచుల భర్తలు వ్యవహారాలు నడుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా సర్పంచ్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి

- విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలీ
- ఏబీఎస్ఎఫ్ కలెక్టర్ ఆఫీస్ ముట్టడి
- ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలని శుక్రవారం ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టర్ కార్యాలయం ముట్టడి..అనంతరం ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు న్యాయం చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు విద్యార్థులు నిరుద్యోగులు వారి తల్లి తండ్రులు నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నేటి వరకు విద్యార్థులు. నిరుద్యోగులకు పూర్తిగా అన్యాయం చేసారని. ముఖ్యమంత్రి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు మధ్యలోనే చదువులు ఆపాల్సిన పరిస్థితి నెలకొందని. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని. ప్రభుత్వా విద్యాసంస్థను బలోపేతం చేసి అక్రమంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకొని అనుమతులు లేని విద్యాసంస్థలను మూసివేయాలని తెలంగాణా రాష్ట్రానికి విద్యాశాఖమంత్రినీ నియమించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే విద్యార్థుల పక్షాన ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంద నరేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ కెయూ అధ్యక్షులు అడ్డా రాజేష్ జిల్లా నాయకులు పోతుగంటి ఉదయ్ కిరణ్ కార్తీక్ వెంకటేష్ భాను సాయి కిరణ్ వెంకటేష్ ప్రసన్న కళ్యాణి ప్రవళిక పల్లవి తదితరులు పాల్గొన్నారు.




# బీజేపీ మౌనం..బిఆర్ఎస్ పోరాటం!

- ప్రజల గోడు పట్టించుకోని బీజేపీ నాయకులు?
- వికారాబాద్ జిల్లాలో ప్రజలను వేధిస్తున్న సమస్యలు
- అధికార పార్టీ పై నిత్యం గళమెత్తుతున్న బిఆర్ఎస్
- బీజేపీ మౌనంపై రాజకీయ వర్గాల్లో చర్చ

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయ పార్టీల పాత్రపై ప్రస్తుతం చర్చ సాగుతోంది. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండగా.. ప్రజలను వేధిస్తున్న సమస్యలపై అధికార పార్టీతో పాటు ప్రతిపక్షాల వైఖరిపైనా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో ప్రజా సమస్యలపై బీజేపీ నాయకులు ఆశించిన స్థాయిలో గళమెత్తడం లేదనే విమర్శలు వినిపిస్తుండగా.. బిఆర్ఎస్ మాత్రం పలు సమస్యలను ప్రజల తరపున అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తోందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.సమస్యలపై బీజేపీ మౌనమేనా?ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్, ప్రభుత్వ సేవలు తదితర సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు నిరంతరం ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.

అయితే స్థానికంగా బీజేపీ నేతలు ప్రజా సమస్యలపై చురుకైన పోరాటం చేయడం లేదనే విమర్శలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు ఎంతవరకు పరిష్కారమవుతాయి? బీజేపీ తన మౌనాన్ని వీడి ప్రజా సమస్యలపై గళమెత్తుతుందా? టీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం చేస్తుందా? అన్నది రానున్న రోజుల్లో రాజకీయంగా ఆసక్తికరంగా మారనుంది.




# ల్యాదేళ్ల సర్పంచ్ పై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు

- గ్రామస్థుడి భూమిపై సర్పంచ్ కన్ను
- నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజా వాయిస్ హన్మకొండ** /దామెర హనుమకొండ జిల్లా దామెర మండలం లోని ల్యాదేళ్ల గ్రామ సర్పంచ్ తన భూమిని కాజేయధలచి ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేస్తున్నారని ల్యాదేళ్ళ గ్రామానికి చెందిన ఆకునూరి రాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది..తనకు చట్టబద్ధంగా ల్యాదేళ్ల గ్రామంలో ని సర్వే నెంబర్ 12/సి లోని 0.15 గుంటల భూమిని వివాదంలోకి లాగేందుకు సర్పంచ్ ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.తన భూమికి సంబంధించిన పత్రాలు, హక్కులు తన వద్ద ఉన్నప్పటికీ సర్పంచ్ వాటిని పట్టించుకోకుండా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని గ్రామస్థుడు ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.అధికారిక రికార్డులు, భూ పత్రాలను పరిశీలించి, తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా లేదా అన్నది తేల్చాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. అలాగే తన భూమి విషయంలో ఎలాంటి జోక్యం, ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని. ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై సంబంధిత సర్పంచ్ వివరణ తెలియాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# వనపర్తి పట్టణంలో విజృంభిస్తున్న డెంగ్యూ, మలేరియా తక్షణమే అత్యవసర వైద్య పారిశుధ్య చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కు తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాషా విజ్ఞప్తి



**ప్రజా వాయిస్.. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా** వనపర్తి పురపాలక పరిధిలోని 33 వార్డులలో పారిశుధ్య లోపం కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, ప్రజలు ఆసుపత్రుల పాలై తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలంగాణ జనసమితి( టీజేఎస్) వనపర్తి జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాషా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పురపాలక పరిధిలోని 33వ వార్డు మరియు 24వ వార్డులలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.ఈ పర్యటనలో భాగంగా 33వ వార్డులో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న ఒక చిన్నారిని నేరుగా సందర్శించి పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఖాదర్ పాషా మాట్లాడుతూ.. వనపర్తి పట్టణంలోని మురుగుకాల్వల పూడికతీత సరిగ్గా జరగకపోవడం, నిలిచిన మురుగు నీటిలో దోమలు విపరీతంగా పెరిగిపోవడం వల్లే పట్టణంలో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. నిరుపేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ తీవ్రమైన పరిస్థితిపై వనపర్తి జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని కింద పేర్కొన్న అత్యవసర చర్యలు చేపట్టాలని పత్రికా ప్రకటన ద్వారా కోరారు

**ముఖ్యమైన విజ్ఞప్తులు & డిమాండ్లు:**

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ & ఫాగింగ్:33వ మరియు.6..3వ, 24 వ వార్డులలో పాటు పట్టణంలోని అన్ని 33 వార్డులలో రోజువారిగా ఫారింగ్ మరియు నిల్వ నీటిలో యాంటీ లార్వా పిచికారి ముమ్మరంగా నిర్వహించాలి. జ్వరాల ఉధృతి ఎక్కువగా ఉన్న వార్డుల్లో తక్షణమే ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు మరియు మందులు పంపిణీ చేయాలని అన్నారు. వనపర్తి జిల్లా ఆస్పత్రిలో డెంగ్యూ రోగుల కోసం ప్రత్యేక బెడ్లు ప్లాట్ లెట్స్ మరియు తగినంత మందులు నిలువలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం మరియు పురపాలక అధికారులు యుద్ధప్రతిపాదికన స్పందించాలని. బాధితులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఖాదర్ పాషా అధికారులకు.విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కే.వంశిధర్. సతీష్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా బీటీ రోడ్డు పనుల నిర్మాణం

- హర్షంవ్యక్తం చేస్తున్న మండల ప్రజలు
- మండల కేంద్రానికి రహదారి పూర్తి అయితే రాకపోకలు మరింత పెరిగే అవకాశం
- కాంట్రాక్టర్ నారాయణరెడ్డి



**ప్రజా వాయిస్.. ఉమ్మడి మహబూబ్నగర్** జిల్లావనపర్తి జిల్లావీపనగండ్ల మండల కేంద్రం నుంచి బెక్కెం గ్రామం వరకు పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.సుమారు రూ.3.90 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.ఈ ప్రధాన రహదారి పూర్తయితే వీపనగండ్ల మండల కేంద్రం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంతో పాటు విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంట్రాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి ఇ, ఏ ఈ , వర్క్ ఇన్స్పెక్టర్లు మాందాపురం రాజు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.





## రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పెగడపల్లి విద్యార్థులు

- విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే
- యోగా కిట్లు, సహకారం అందిస్తామని హామీ.
- జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**ప్రజా వాయిస్ / హనుమకొండ.**గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ పరిధిలోని పెగడపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం పట్ల వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శనివారం హనుమకొండలోని తన నివాసంలో శాలువాలతో సత్కరించి అభినందించారు.1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలోనూ ప్రతిభ చాటేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వెళ్లే విద్యార్థులకు యోగా కిట్లు అందించడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.విద్యార్థులను యోగా పోటీలకు సిద్ధం చేసి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లిన వ్యాయామ ఉపాధ్యాయురాలు జి. శారదను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు క్రీడలు, యోగా వంటి అంశాల్లో విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి శారీరక, మానసిక సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు గంట రాజిరెడ్డి, రవి యాదవ్, డబ్బా శ్రీను, యూత్ కాంగ్రెస్ నాయకులు దామెర ప్రణీత్, సంపత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సక్రమంగా అందించాలని హాలియాలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో

- వ్యవసాయానికి 18 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వాలి
- రైతుల అధిక సంఖ్యలో పాల్గొని ధర్నా
- కోదాడ ,జడ్చర్ల జాతీయ రహదారి రాకపోకలు నిలిచాయి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాశీ వెళ్లి గంగా నదిలో పుణ్య స్నానం చేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- రాష్ట్రంలో గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ కాళేశ్వరం పంపులను ఆన్ చేయకుండా రాజకీయ కక్ష సాధింపు పాల్పడుతూ రైతులను బలి చేస్తున్నారని అన్నారు




**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:** రైతులకు ఉచిత విద్యుత్ సక్రమంగా, నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ హాలియాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య ను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతోనే రాష్ట్రానికి అరిష్టం పట్టుకుంది అందుకే రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితి నెలకొన్నాయని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు.గత శాసనసభ పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రజలకు అలువిగాని హామీలను ఇచ్చి దేవుళ్ళపై ఒట్టేసి ప్రజలను మోసగించడం జరిగిందని అందుకే రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాశీ వెళ్లి గంగా నదిలో పుణ్య స్నానం చేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే నాగార్జునసాగర్ నియోజకవర్గానికి వచ్చి వర్షం కోసం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే వరుణ యాగంలో పాల్గొనాలి.వ్యవసాయానికి 18 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని హాలియాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో అధికారులు దిగివచ్చి రైతులు కోరుకున్న విధంగా వ్యవసాయానికి 18గంటల పాటు నిర్విరామంగా కరెంటు సప్లై చేస్తామని హామీ ఇచ్చిన అనంతరం మాజీ ఎమ్మెల్యే రాస్తారోకో విరమించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి దేవులపై నమ్మకం ఉందన్నారు కాంగ్రెస్ పార్టీ వర్షం కోసం చేస్తున్న యాగాన్ని బిఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తున్నట్లు చెబుతూనే వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.గత బిఆర్ఎస్ వ్యవసాయానికి 24 గంటల కరెంటు అందిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 12 గంటలు కూడా సక్రమంగా రైతులకు కరెంటు సరఫరా చేయడం లేదని అన్నారు ఇచ్చే కరెంటు కూడా 6 గంటలకు 6 గంటలకు మధ్య బ్రేక్ పెడుతున్నారని రైతులకు మడి కూడా తడవని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో గోదావరి జలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ కాళేశ్వరం పంపులను ఆన్ చేయకుండా రాజకీయ కక్ష సాధింపు పాల్పడుతూ రైతులను బలి చేస్తున్నారని అన్నారు.మిగులు జలాల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోదావరి జలాలను ఆంధ్రకు అప్పనంగా అందజేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం పంపులను ఆన్ చేసి గోదావరి జిల్లాలను ఎత్తిపోస్తే తెలంగాణలో సగభాగం సస్యశ్యామలవుతుందన్నారు.గోదావరిలో నీళ్లు ఉన్న ముఖ్యమంత్రి కరెంట్ ఇవ్వకపోవడం వల్లనే రాష్ట్రంలో రైతులు దుర్భిక్ష పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ రాస్తారోకోకు దిగి వచ్చిన విద్యుత్ శాఖ జిల్లా అధికారి వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు .ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు......



## ఒక్క చినుకు.. వేల ఆశలు

- రైతు బతుకులో వెలుగుల కోసం వరుణ యాగం
- రైతాంగ సంక్షేమం-రాష్ట్ర సుభిక్షం కోసం సాగర్ తీరాన మహోన్నత యాగం
- వర్షాలు సమృద్ధిగా కురిసి పంట పొలాలు పచ్చబడాలని ఆకాంక్ష
- సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి
- భద్రత, యాగ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు

**నాగార్జునసాగర్,ప్రజా వాయిస్:** ఒక్క చినుకు పడితే చాలు.. రైతు గుండెల్లో వేల ఆశలు చిగురిస్తాయి. పొలాల్లో పచ్చదనం పరుచుకుంటే అన్నదాత ఇంట ఆనందం వెల్లివిరుస్తుంది. వర్షం రైతుకు కేవలం నీరు కాదు.. అతని కుటుంబ భవిష్యత్తు, పంటపై పెట్టుకున్న ఆశ, కష్టానికి దక్కే ఫలితం. ఈ ఆశలకు ప్రతీకగా, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నందికొండ మున్సిపాలిటీ విజయవిహార్ ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీ సోమవారం రైతాంగ సంక్షేమం,రాష్ట్ర సుభిక్షం కొరకు మహోన్నత వరుణ యాగం నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంట పొలాలు పచ్చగా మారాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నీటితో నిండాలని, రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరియాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ మహా కార్యక్రమానికి సంబంధించి యాగస్థలం, వేదిక, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆర్డీవో రమణా రెడ్డి తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి యాగస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే భద్రతా ఏర్పాట్లు, యాగ నిర్వహణ, ప్రజల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. యాగస్థలంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. రైతాంగ సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం నిర్వహిస్తున్న ఈ మహా వరుణ యాగాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సూచించారు. వాన చినుకులతో పొలాలు కళకళలాడాలని, జలాశయాలు నిండాలని, అన్నదాత బతుకుల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ ఈ యాగం నిర్వహించనున్నారు.

## జర్నలిస్టులందరికీ సీనియారిటీ ప్రకారం ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- ఎల్లారెడ్డిపేట టిడబ్ల్యుజేయు ప్రెస్ క్లబ్ సమావేశంలో అధ్యక్షులు పంజా సంపత్ కుమార్ డిమాండ్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ ఎల్లారెడ్డిపేట** భారత ప్రభుత్వం గుర్తించి ఆర్ఎన్ఐ సర్టిఫికేట్ పొందిన ప్రతి పత్రికలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ సీనియారిటీ ప్రకారం ఇండ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టిడబ్ల్యుజేయు) ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంజా సంపత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన ప్రెస్ క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా సమాజహితం కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ నిరంతరం శ్రమిస్తున్న పాత్రికేయుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించవద్దన్నారు. సంస్థ గుర్తింపు కార్డు (ఐడీ కార్డు) ఉన్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఇండ్ల స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌లకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ నాయకులు పోతుల గాంధీబాబు, రెడ్డిమల్ల సత్యనారాయణ, పండుగ బాబు, పుల్లూరి సత్యం, జనగామ రమేష్, ఏర్పుల నారాయణ మరియు ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





## కుప్పలు పోశారు పరచడం మరిచారు

- సాయినగర్ కాలనీ వార్డు నెంబర్ వన్ లో గుత్తేదారు పరచడం మరిచిన వైనం
- కంకర చిప్ కుప్పను రోడ్లో పోశారు పరచడం మరిచారు
- వార్డు కౌన్సిలర్ సాబ్, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పట్టణ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు నెంబర్ సాయిరాం నగర్ కాలనీలో బురదమైన రోడ్లకు గాను అధికారులు ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కాలనీ బురద రోడ్లకు గుంతలు పూడ్చేందుకు పోసిన కంకర చిప్ కుప్పలను పరచక ప్రజలకు, వాహనాదారులకు కష్టాలు తప్పడం లేదు. కంకర చిప్పును గుంతల్లో కుప్పలుగా పోయగా గుత్తేదారు పరచడం మరిచారు. కావున ఇకనైనా సంబంధిత అధికారులు, వార్డు నెంబర్ కౌన్సిలర్ అరుణ్ కుమార్ దృష్టి సారించి సమస్యలు తీర్చాలని కాలనీ బాటసారులు కోరుతున్నారు..



## సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన

- రైతులకు గిట్టుబాటు ధర,కూలీలకు రోజుకు 800 వేతనం కలిపించాలి
- సిఐటియు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు

**ప్రజా వాయిస్,నారాయణఖేడ్.**సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ల కోసమే పని చేస్తుందని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికులకు అన్యాయం చేసే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు 800 వేతనం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వనపర్తికి కొత్త భవనాల మంజూరుకు ప్రతిపాదనలు

- మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి నివేదికలు అందజేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- రవాణా శాఖకు శాస్త్రీయ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ తో నూతన కార్యాలయ భవనం
- నాలుగు బీసీ సంక్షేమ విద్యాసంస్థలకు నూతన భవనాల ప్రతిపాదనలు
- భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంజూరు చేయాలని విజ్ఞప్తి
- వనపర్తి అభివృద్ధికి సహకరిస్తామని మంత్రి పొన్నం హామీ



**ప్రజా వాయిస్ | ఉమ్మడి మహబూబ్‌నగర్.**వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి పలు కీలక అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనల నివేదికలను సమర్పించారు. వనపర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు బీసీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా, వసతి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో శాస్త్రీయ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ తో కూడిన జిల్లా రవాణా కార్యాలయ నూతన భవనంతో పాటు చిట్యాలలో ఎంజేపీ తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలుర) నూతన భవనం, కడుకుంట్లలో ఎంజేపీ తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలుర) నూతన భవనం, పెబ్బేరులో ఎంజేపీ తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల) నూతన భవనం, వెల్టూరులో ఎంజేపీ తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల) నూతన భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న వసతులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన భవనాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే వనపర్తి జిల్లాకు అవసరమైన రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంతో పాటు బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు అందించేందుకు ఈ భవనాల నిర్మాణం ఎంతో అవసరమని వివరించారు. ఎమ్మెల్యే సమర్పించిన ప్రతిపాదనలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందిస్తూ, వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి ఆయా శాఖల పరిధిలో అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే మంజూరీలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# జనగామ కాంగ్రెస్‌లో ఐక్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా ముందుకు సాగాలి
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బూత్ స్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో చీఫ్** జనగామ, ఆగస్టు 08: జనగామ జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశం, నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల, టౌన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల సమావేశం, సన్మాన కార్యక్రమం, నూతన కార్యవరాల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే శ్ మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ, పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ సంఘాల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా, క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని మరింత పటిష్టం చేయడం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించి చర్చించారు.డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి మాట్లాడుతూ, జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. వ్యక్తిగత విభేదాలు, నాయకుల మధ్య వైషమ్యాలు, గ్రూపు రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు. తాను గిరిజన మహిళగా డీసీసీ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జనగామలో 24 గంటలు అందుబాటులో ఉంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు.నాయకుల మధ్య ఉన్న విభేదాలు, గొడవలను తన వద్దకు తీసుకురావడం కంటే సమన్వయంతో పరిష్కరించుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అంతర్గత విభేదాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రతి ఇంటికీ తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు.వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక అంశంపై పోరాటం ప్రారంభిస్తే చివరి వరకు పోరాడుతారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని, రాబోయే రెండేళ్లు కష్టపడి పనిచేస్తే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉందని అన్నారు.కాంగ్రెస్ శ్రేణులు గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయని, వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు.జనగామలో కాంగ్రెస్ జెండా బలంగా ఎగరాలి అంటే ప్రస్తుతం పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో పనిచేసేలా ప్రోత్సహించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఎంత పెద్ద పాము అయినా చలి చీమల వల్ల చనిపోతుంది. అంటూ బీజేపీపై వ్యాఖ్యానించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య.. ప్రజల చేతిలో బీజేపీకి ఓటమి తప్పదని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.వై టి డి ఏ బోర్డు మెంబర్ డా. లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ, జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.పార్టీలో చిన్నచిన్న అభిప్రాయ భేదాలు సహజమేనని, వాటిని పక్కనపెట్టి పార్టీ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. వ్యక్తిగత రాజకీయాలకు, గ్రూపు విభేదాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కాంగ్రెస్ జెండా, పార్టీ బలోపేతమే అందరి ప్రధాన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా, పట్టణ, మండల, అనుబంధ సంఘాల కార్యవర్గాలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలతో మరింత బలమైన అనుబంధాన్ని ఏర్పరచాలని పిలుపునిచ్చారు.నూతన కార్యవర్గాలు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఐక్యత, సమన్వయం, క్షేత్రస్థాయి ప్రజా సంబంధాలు, పార్టీ బలోపేతం అనే నాలుగు అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని నాయకులు సూచించారు.

# పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

- ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలి
- అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజా వాయిస్. మంచిర్యాల**.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, నీటిపారుదల శాఖ ఈ.ఈ. శ్రీనివాస్ లతో కలిసి నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులతో జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, సాగునీటి లభ్యత, పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, రైతుల సమస్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం విధులలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటి వనరులు, కాలువలు తదితర వాటి నిర్వహణను సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిలో మొదటి ప్రాధాన్యత త్రాగునీటికి ఇవ్వాలని, నీటి వృథాను పూర్తిగా నివారిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో రైతులను కలిసి పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితులలో అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు వల్ల కలిగే నష్టాలు, దిగుబడులు తగ్గే అవకాశాలను రైతులకు ముందుగానే వివరించాలని, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంతో పాటు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందుబాటులో ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తూ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని, పంటల వైవిధ్యీకరణపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, వ్యవసాయం, సాగునీటికి సంబంధించి వచ్చే ప్రతికూల వార్తలు, ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని, రైతులకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. నీటి విడుదల, కాలువల నిర్వహణ, పంటల సాగు తదితర అంశాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు నష్టం కలుగకుండా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని తెలిపారు.మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో నీటి ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించాలని, ఎక్కడా నీటి వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతు ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. రాజకీయ ఉద్దేశాలకు రైతులు ప్రభావితం కాకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. ఇటీవల కర్ణమామిడి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇప్పటికే నారు పోసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలుగకుండా కడెం రిజర్వాయర్ నుండి ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి నూతన చేయూత పింఛన్ల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చేయూత పింఛన్లలో భాగంగా వితంతు పింఛన్, ఒంటరి మహిళల పింఛన్, దివ్యాంగుల పింఛన్, గీత కార్మికుల పింఛన్, చేనేత కార్మికుల పింఛన్, ఫైలేరియా, డయాలసిస్ రోగుల పింఛన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని, సంగారెడ్డిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం కానుండగా, మిగిలిన ప్రాంతాలలో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు నీటి లభ్యత, పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మార్కెట్ పరిస్థితులు తదితర అంశాలపై అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలని, రైతుల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల చైర్మన్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, ఎ.ఈ.లు, డి.ఈ.లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బావిని పూడ్చేశారు.. స్థలాన్ని కబ్జా చేశారు

- 32వ వార్డులో ప్రభుత్వ ఆస్తిపై నిర్మాణం
- అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు
- సమగ్ర విచారణకు డిమాండ్




**ప్రజా వాయిస్,కోదాడ**:కోదాడ పట్టణంలోని 32వ వార్డులో ప్రభుత్వ పరిధిలో ఉన్న చేదబావిని పూడ్చివేసి, చుట్టూ ఉన్న బాటను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారంటూ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తిని పూడ్చి నిర్మాణం చేపట్టేందుకు ఎవరు అనుమతులు ఇచ్చారో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఎప్పటి నుంచో స్థానికులకు ఉపయోగకరంగా ఉన్న బావిని పూడ్చివేయడంతో భవిష్యత్‌లో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేందుకు ఇలాంటి నీటి వనరులను పరిరక్షించాల్సిన అధికారులు, వాటిని కాపాడటంలో విఫలమవుతున్నారని విమర్శించారు.ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరు మంజూరు చేశారు? బావి, దాని చుట్టూ ఉన్న బాటను పూడ్చేందుకు అనుమతి ఎలా ఇచ్చారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడటంతో పాటు బావిని, పూడ్చిన బాటను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మోడీ అమ్ములు, చింతలపాటి శ్రీలత, లంక రజిని, అప్పారావు రాఘవ, ఉమామహేశ్వరరావు, సామ్రాజ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు




# పోలీసుల మెరుపు తనిఖీలు

- అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నజర్
- ఇద్దరు అదుపులోకి
- 65 ద్విచక్ర వాహనాలు,3ఆటోలు,56 మద్యం బాటిల్ల స్వాధీనం
- ప్రజల భద్రతే లక్ష్యం: తాండూరు డీఎస్పీ యాదయ్య

**ప్రజావాయిస్/తాండూరు:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో తాండూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాణిక్ నగర్ ,మున్సిపల్ క్వార్టర్స్ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.తాండూర్ డీఎస్పీతో పాటు తాండూర్ టౌన్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, కరణ్ కోట్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ పోలీసు సిబ్బంది, ఏఆర్ పార్టీ సిబ్బంది పాల్గొని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, అక్రమ కార్యకలాపాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఇద్దరు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు, పాపిలాన్ పరికరాన్ని ఉపయోగించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 65 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు మరియు 56 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు మరియు ఇతర రికార్డులను పరిశీలించిన అనంతరం, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.డీఎస్పీ మాట్లాడుతూ..ఎస్పీ ఆదేశాల మేరకు తాండూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.

# వర్ధన్నపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వేధింపులు

- మహిళా సిబ్బందిపై జూనియర్ డాక్టర్ దుర్భాషలు ఆడుతూ వేధిస్తున్నాడని బాధితురాలి ఆవేదన
- ప్రభుత్వ దవాఖానకు వస్తె తన ప్రవేట్ హాస్పిటల్ కి పోవాలని సూచిస్తున్నట్లు సర్వత్ర చర్చ
- నకిలీ అవుట్సోర్సింగ్ సర్టిఫికెట్లను చూపించి జూనియర్ డాక్టర్ గా చాలామాణి అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం
- కలెక్టర్ పలుమార్లు చెప్పిన సూపరిండెంట్ ఆ డాక్టర్ కు RMO బాధ్యతలను అప్పచెప్పడంపై అనుమానాలు






**ప్రజా వాయిస్ వరంగల్ బ్యూరో:** పేద ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన వర్ధన్నపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి) వివాదాలకు నిలయంగా మారింది. ఆసుపత్రిలో పనిచేస్తున్న ఓ వైద్యుడి అరాచకాలు, బూతు పురాణం పరిమితులు దాటుతున్నాయని అందులో పనిచేసే రెగ్యులర్ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మహిళా ఉద్యోగిపై బూతు పురాణం.. మానసిక వేధింపులు..ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా స్వీపర్ పట్ల డాక్టర్ భరత్ అత్యంత నీచంగా, అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, మహిళ అని కూడా చూడకుండా బూతులు తిడుతూ తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ పిల్లలను హైదరాబాద్ లో విడిచిపెట్టి ఉద్యోగరీత్యా వర్ధన్నపేటలో విధులు నిర్వహిస్తున్నామని,కనీసం వయసు రీత్యా గౌరవం ఇవ్వకుండా బూతులు తిడుతూ మనోవేదనకు గురిచేస్తున్నాడని ఆ అబ్బుత స్వీపర్ ఆవేదన వ్యక్తం చేస్తుంది. గతంలో కూడా ఇదే ఆసుపత్రిలో ఒక మహిళా నర్సు పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సదరు నర్స్ చేతిలో సదరు డాక్టర్ దెబ్బలు తిన్నట్లు వార్తలు గుసగుసలాడుతున్నాయి. ఆసుపత్రిలోని పలువురు మహిళా నర్సులను కూడా ఇతను నిత్యం మానసికంగా వేధిస్తున్నాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**అర్హత లేకున్నా RMO బాధ్యతలా? నకిలీ అవుట్సోర్సింగ్ పత్రాలతో పరిమినెంట్ జూనియర్ డాక్టర్ గా చలామనీ??**

ప్రభుత్వ వైద్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, వర్ధన్నపేటలోని తన ప్రైవేట్ దవాఖానాకు పేషెంట్లను మళ్లించేందుకు ఆసుపత్రికి వచ్చే పేద రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని స్థానికులు మండిపడుతున్నారు. అంతేకాకుండా, తన ప్రైవేట్ దవాఖానాలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమ అబార్షన్లు సైతం చేస్తున్నాడనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.కనీస అర్హతలు, నిబంధనలు పక్కనబెట్టి ఆ డాక్టర్ కు RMO (రిజిస్టర్డ్ మెడికల్ ఆఫీసర్) బాధ్యతలు అప్పగించడం వెనుక సూపరింటెండెంట్ పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా తను జూనియర్ డాక్టరుగా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో కొనసాగడానికి నకిలీ అవుట్సోర్సింగ్ సర్టిఫికెట్లను సృష్టించి ఉద్యోగ స్థానాన్ని పొందారనే విమర్శలు సైతం దవాఖానలో గుసగుసలు వినిపిస్తున్నాయి..

**కలెక్టర్ మాటలకు విలువ ఎలాగు లేదు..**
**కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానంటే హౌజ్ అరెస్ట్ మాదిరిగా డాక్టర్ పన్నాగం .??**

విధుల పట్ల నిర్లక్ష్యం, సిబ్బందిపై వేధింపులు, ఆరోపణలు ఉన్న సదరు వైద్యుడికి బాధ్యతలు అప్పగించవద్దని, ఆసుపత్రి పాలనను చక్కదిద్దాలని జిల్లా ఉన్నతాధికారులు సూచించినా సూపరింటెండెంట్ లెక్కచేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అర్హత లేకున్నా సదరు వైద్యుడికే బాధ్యతలు అప్పగించడంలో సూపరింటెండెంట్ కనబరుస్తున్న ఈ 'ప్రత్యేక చొరవ' వెనుక అసలు మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలు, నిధుల గోల్‌మాల్, ప్రైవేట్ దవాఖానాల దందా, నిత్యం వెలుగుచూస్తున్న వివాదాలను సరిదిద్దేందుకే సదరు డాక్టర్‌కు పూర్తి బాధ్యతలు కట్టబెట్టారా? లేక ఆసుపత్రిలోని అవకతవకలను కప్పిపుచ్చుకోవడానికి ఇద్దరూ కలిసి ఈ రకమైన వ్యూహం పన్నుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండ ఆ డాక్టర్ పై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో ఆమెను హౌస్ అరెస్ట్ చేసినట్లుగా హాస్పిటల్ నుండి బయటకు రాకుండా మంతనాలు జరిపినట్లుగా ఆ బాధిత స్వీపర్ వెల్లడించింది.. దీంతో వైద్య వృత్తికే కళంకం తెస్తూ, మహిళా సిబ్బందికి భద్రత లేకుండా చేస్తున్న ఆ డాక్టర్ పై మరియు అతని అరాచకాలకు సహకరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు (DM&HO) తక్షణమే విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ప్రభుత్వ ఐటీఐ,ఏటీసీ లో 8 ప్రత్యేక ట్రేడ్లు

- ఆగస్టు 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు




**శామీర్ పేట / ప్రజా వాయిస్ :** 2026–27 విద్యా సంవత్సరానికి రెండో దశ ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ, ఏ టి సి ప్రిన్సిపాల్ బి. హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15 వరకు అవకాశం రెండో దశ ప్రవేశాల కోసం ఆగస్టు 6 నుంచి ఆగస్టు 15, 2026 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు తమకు నచ్చిన ఐటీఐలు, ట్రేడ్లకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ఇందుకోసం iti.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. 8వ తరగతి నుంచి టెక్నికల్ విద్యకు అవకాశం

ట్రేడ్‌ను బట్టి 8వ తరగతి లేదా 10వ తరగతి ఉత్తీర్ణులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అందుబాటులో ఉన్న ఆధునిక ట్రేడ్లు, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సిఎన్‌సి మెషీన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ ,ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్. మరిన్ని వివరాలకు 9866843920,9866513784,9553515596 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థి జె. మోహన్‌రావు ప్రతిభ



**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** హనుమకొండలో జరిగిన 'ఫస్ట్ తెలంగాణ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్' లో, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి జె. మోహన్‌రావు అండర్–6 బాలుర స్టాండింగ్ లాంగ్‌జంప్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, కోచ్ సత్యనారాయణ మరియు పాఠశాల సిబ్బంది మోహన్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి క్రమశిక్షణ, సాధనతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

- చేయూతనిచ్చిన ఉపాధ్యాయ బృందానికి స్థానికుల అభినందన.



**ప్రజా వాయిస్ ప్రజా వాయిస్ :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామస్తుడైన మైలగాని కిరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ప్రభుత్వ పాఠశాలకు వెనుక వైపునే వారి సొంత ఇల్లు ఉండేది. ప్రభుత్వ పాఠశాల పట్ల ప్రత్యేక అభిమానం కలిగిన కిరణ్ అకాల మరణం పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కల్వచర్ల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కిరణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, సహాయంగా రూ.14,500/–లను కీర్తిశేషులు కిరణ్ గారి భార్య శ్రీమతి మైలగాని అనూషకి చెక్కు రూపేణా అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.ప.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు దేవళ్ల వనజ, గంట్ల రమాదేవి, ఆవిడపు రవి, కే.సత్యవతి, గుండేటి సత్యనారాయణ, గసిగంటి దేవేందర్, కే.శ్రీలత, మల్లారపు శంకర్, కే.సతీష్, ఎం.పి.పి.ఎస్ ప్రధానోపాధ్యాయులు ఆకుల శ్రీనివాస్, కే.వేణుగోపాల్, పి.కిష్టయ్య, ఎల్.పద్మావతి, దివ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. కష్ట సమయంలో ఒక కుటుంబానికి చేయూతనిచ్చిన ఉపాధ్యాయులను స్థానికులు అభినందించారు.

## గడువు ముగిసిన మందు ఇస్తే పిల్లాడు చావాలా

- ఓపిలో పరీక్షించి రెండు సిరప్పులు రాసిన డాక్టర్
- జూన్ 2026 కు గడుముసి ఉండటం గమనించి ఆసుపత్రి వెళ్లి అడగగా దురుసుగా ప్రవర్తించిన సిబ్బంది.




**ప్రజా వాయిస్/మహబూబాద్ జిల్లా :** మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పిల్లవాడికి గడువు ముగిసిన మందులు ఇచ్చిన సిబ్బంది ఆసుపత్రి సిబ్బంది పై బాలుడి తండ్రి ఆగ్రహం మహబూబాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మురళీ తన నాలుగేళ్ల కుమారుడు ఎనోస్ రాజ్ కు వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురయ్యాడు అయితే మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా ఓపీలో పరీక్షించిన రెండు సిరప్‌లు రాసిన డాక్టర్లు
ఒక సిరప్ ఆసుపత్రిలో ఉన్నది ఇవ్వగా మరో సిరప్ బయట తీసుకోమని చెప్పిన సిబ్బంది ఇంటికి వెళ్లి బాలుడికి సిరప్ వేసేందుకు చూడగా.. జూన్ 2026కు గడువు ముగిసి ఉండటం గమనించి.. ఆసుపత్రికి వెళ్లి అడగగా సిబ్బందికి తండ్రికి మధ్య వాగ్వాదం గడువు ముగిసిన మందు ఇస్తే పిల్లాడు చావాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన తండ్రి.

## పుస్కూరి శ్రీనివాస్ రావుని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి..

**ప్రజా వాయిస్/పాలకుర్తి :** పాలకుర్తి మండల మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్ రావు మాతృమూర్తి ప్రమీల ఇటీవలే మరణించగా శనివారం వారి నివాసానికి వెళ్లి ప్రమీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి జిల్లా,మండల నాయకులు,ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# దొంగిలించబడిన/పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలు, మార్పిడి, మరమ్మతులపై కఠిన చర్యలు

- మొబైల్ డీలర్లు, రిటైలర్లు, సెకండ్‌హ్యాండ్ మొబైల్ షాపులు, రిపేర్ సెంటర్ల నిర్వాహకులు ముందస్తుగా IMEI వివరాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలి:
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి




**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** దొంగిలించబడిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సరైన ధృవీకరణ లేకుండా కొనుగోలు చేయడం, విక్రయించడం, మార్పిడి చేయడం లేదా మరమ్మతులు చేయడం చట్టరీత్యా నేరమని, అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని మొబైల్ ఫోన్ డీలర్లు, రిటైలర్లు, సెకండ్‌హ్యాండ్ మొబైల్ షాపులు, రిపేర్ సెంటర్లు, వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం జారీ చేసిన నోటీసు ప్రకారం ప్రతి మొబైల్ ఫోన్ లావాదేవీలో కింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్‌ను కొనుగోలు, విక్రయించడం, మార్పిడి చేయడం లేదా రిపేర్ చేయడానికి ముందు సెయిర్ పోర్టల్‌లో IMEI నంబర్‌ను తప్పనిసరిగా తనిఖీ చేయాలి. CEIR ద్వారా పోగొట్టుకున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయవచ్చు. తమ వద్దకు వచ్చే ప్రతి మొబైల్ ఫోన్‌కు సంబంధించిన IMEI నంబర్‌ను నమోదు చేసి భద్రపరచాలి.

మొబైల్ ఫోన్‌ను విక్రయించే వ్యక్తి పేరు, చిరునామా, మొబైల్ నంబర్, ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ ఐడీ/పాస్‌పోర్ట్ వంటి ఫోటో గుర్తింపు పత్రం, అలాగే లైవ్ ఫొటోను తప్పనిసరిగా సేకరించాలి.

అన్ని లావాదేవీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, రిజిస్టర్‌ను భౌతికంగా లేదా డిజిటల్ రూపంలో తప్పనిసరిగా నిర్వహించాలి.

బ్లాక్/బ్లాక్‌లిస్ట్ అయిన IMEI ఉన్న మొబైల్ ఫోన్లు, సరైన యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు లేని ఫోన్లు లేదా చోరీకి గురైనట్లు అనుమానం ఉన్న ఫోన్లతో ఎట్టి పరిస్థితుల్లోనూ లావాదేవీలు చేయరాదు.

అనుమానాస్పదంగా ఉన్న లేదా చోరీకి గురైనట్లు భావిస్తున్న మొబైల్ ఫోన్ లభించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ సెల్‌కు సమాచారం అందించాలి.

**చట్టపరమైన హెచ్చరిక**

చోరీకి గురైన వస్తువులను తెలిసీ కొనుగోలు చేయడం లేదా తమ వద్ద ఉంచుకోవడం భారతీయ న్యాయ సంహిత (BNS), 2023లోని సెక్షన్ 317 కింద నేరంగా పరిగణించబడుతుంది. సెక్షన్ 317(2) ప్రకారం చోరీ సొత్తును తెలిసీ స్వీకరించినా లేదా తమ వద్ద ఉంచుకున్నా మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. అదేవిధంగా, చోరీకి గురైన కమ్యూనికేషన్ డివైస్‌ను అది చోరీ సొత్తు అని తెలిసి లేదా తెలిసే కారణం ఉన్నప్పటికీ నిజాయితీ లేకుండా స్వీకరించడం లేదా తమ వద్ద ఉంచుకోవడం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000లోని సెక్షన్ 66B కింద నేరం. దీనికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ.1 లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు. తనిఖీలు లేదా దర్యాప్తు సమయంలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి హెచ్చరించారు. మొబైల్ ఫోన్ వ్యాపారులు పోలీసు శాఖకు సహకరిస్తూ, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల చలామణిని అరికట్టడంలో భాగస్వాములు కావాలని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి సూచించారు.

## భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ఘనంగా బోనాల పండుగ

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రత్యేక ప్రదర్శనలు



**ప్రజావాయిస్/ కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం భాగ్యరథి డిగ్రీ కళాశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని కళాశాల విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారి వేషధారణలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆకట్టుకునే ప్రదర్శనలు నిర్వహించారు.

బోనాల పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు చేసిన వివిధ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడం, సంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమానికి మరింత శోభను తీసుకొచ్చాయి.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను వారు అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బోనాల పండుగ భక్తి, ఐక్యత, క్రమశిక్షణతో పాటు తెలంగాణ సాంస్కృతిక విలువలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

అనంతరం కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి బోనాల పండుగను ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

## పాలకుర్తిలో ఘనంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి వివాహ మహోత్సవ వేడుకలు..

- దాంపత్య జీవితంలో మరెన్నో ఆనందకరమైన సంవత్సరాలు కలిసి సాగాలి.
- ప్రజా సేవలో మహిళ సాదరికతలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి కృషి అభినందనీయం.
- పాలకుర్తి ఎమ్మెల్యే



**ప్రజా వాయిస్/పాలకుర్తి :** జనగామ జిల్లాపాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి వివాహ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి హాజరై కేక్ కట్ చేసి ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ఝాన్సీ రాజేందర్ రెడ్డి దాంపత్య జీవితంలో మరెన్నో ఆనందకరమైన సంవత్సరాలు కలిసి సాగాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో, మహిళా సాధికారతలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. వారి నాయకత్వం, సేవా దృక్పథం పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు ఝాన్సీ రాజేందర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మహిళా సాధికారత, యువత అభివృద్ధి, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఆమె చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పరకాల ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై ఆర్టిఐ ద్వారా సమాచారం

- ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కేటాయించిన నిధులు. వాటి వినియోగం.
- అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు వాటి పరిస్థితి స్థితిగతులు.
- ఖాళీగా ఉన్న పోస్టులు ఇబ్బంది కొరత ప్రజలకు అందుతున్న వైద్య సేవలు.
- బిజెపి పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు. గాజుల నిరంజన్



**ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల :** పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలు, ఆసుపత్రి అభివృద్ధి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు మరియు అందుబాటులో ఉన్న సౌకర్యాలకు సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ యాక్ట్ 2005) ద్వారా బిజెపి పరకాల పట్టణ అధ్యక్షులు గాజులు నిరంజన్ శనివారం దరఖాస్తు చేశారు..

ఆసుపత్రిలో గత కొంతకాలంగా కొనసాగుతున్న సమస్యలకు సంబంధించి. ఆసుపత్రి అభివృద్ధికి కేటాయించిన నిధులు, వాటి వినియోగం. అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, వాటి పరిస్థితి స్థితిగతులు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది వివరాలు ఖాళీగా ఉన్న పోస్టులు, సిబ్బంది కొరత ప్రజలకు అందుతున్న వైద్య సేవలు ఆసుపత్రిలో ఉన్న మౌలిక సదుపాయాలు మందులు మరియు ఇతర వైద్య సామగ్రి సరఫరా వివరాలు గత రెండు సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు తదితర అంశాలపై పూర్తి వాస్తవ సమాచారాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఆర్టిఐ ద్వారా వివరాల కోసం దరఖాస్తు చేశానని. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ. ప్రజలకు మెరుగైన వైద్యం, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ప్రజా ప్రయోజనం కోసం ప్రశ్నించడం మా బాధ్యత...

ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం మా లక్ష్యమని తెలిపారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ అరెస్ట్


- బంగారం తాకట్టు.. జల్సాలు
- దొంగ వనం రాము ఆటకట్టించిన రామగిరి పోలీసులు



**ప్రజా వాయిస్ మంథని :** పగటిపూట తాళం వేసిన ఇళ్లను రెక్కీ చేసి, రాత్రివేళల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న జగిత్యాలకు చెందిన వనం రాము (36)ను రామగిరి పోలీసులు, మంథని సీఐ ప్రత్యేక బృందం శనివారం అరెస్ట్ చేశారు. కల్వచర్ల, ఓదేడు, ముత్తారం, ధర్మారం తదితర ప్రాంతాల్లో తన ముఠాతో కలిసి ఇతడు పలు చోరీలకు పాల్పడినట్లు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు. దొంగిలించిన బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టి, ఆ డబ్బుతో సెప్టిక్ ట్యాంకర్ వాహనం కొనుగోలు చేయడంతో పాటు జల్సాలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. రామగిరి పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్సై శ్రీనివాస్ బృందం రామును అదుపులోకి తీసుకుని విచారించగా ఈ చోరీల కోణం బయటపడింది. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న పోలీస్ బృందాన్ని ఏసీపీ అభినందించారు.

## చేయూత పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

- అర్హులైన వారు మండల పరిషత్ అభివృద్ధి, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజా వాయిస్ ఉమ్మడి ఆదిలాబాద్/ మంచిర్యాల :** చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుమంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. అర్హత కలిగిన వారు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం లేదా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హీమోఫీలియా బాధితులు, బీడీ కార్మికులు, బీడీ టేకేదార్లు, బోదకాలు బాధితులు, డయాలసిస్ రోగులు, చేనేత కార్మికులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, యూడీఐడీ/సదరం ధ్రువీకరణ పత్రాలను జత చేయాలని సూచించారు. అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## ఉస్మానియా వక్ఫ్ మస్జిద్ సమస్యలు తీర్చే బాధ్యత ఎవరిది?

- ప్రభుత్వానిదా? వక్ఫ్ బోర్డుదా?
- ఏఐఎంఐఎం జిల్లా జాయింట్ సెక్రటరీ మహమ్మద్ గౌస్ ఖాన్



**ప్రజా వాయిస్, హుజూర్ నగర్ :** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని ఉస్మానియా (వక్ఫ్) మస్జిద్ లో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదా? వక్ఫ్ బోర్డుదా? అని ఏఐఎంఐఎం జిల్లా జాయింట్ సెక్రటరీ మహమ్మద్ గౌస్ ఖాన్ ప్రశ్నించారు.

శనివారం ఆయన సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేస్తూ గతంలో ఉస్మానియా మస్జిద్ కాంప్లెక్స్‌కు నెలకు సుమారు రూ.50 వేల ఆదాయం ఉన్నప్పుడు కూడా అనేక సమస్యలు ఉండేవని, 2020లో మేనేజ్‌మెంట్ కమిటీ కాలపరిమితి ముగిసే నాటికి ఆదాయం రూ.1.75 లక్షలకు పెరిగినా, అప్పటి సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. మస్జిద్ ఆదాయం పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మస్జిద్ ఆదాయం పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్ స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించినా సరైన స్పందన లేదని ఆరోపించారు. కొత్త మేనేజ్ మెంట్ కమిటీ వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తుందంటూ అధికారులు దాటవేస్తున్నారని విమర్శించారు. నెలకు రూ.1.75 లక్షల ఆదాయం వస్తున్న నేపథ్యంలో ఆ నిధులను మస్జిద్ అభివృద్ధి, నిర్వహణ, సిబ్బంది సంక్షేమం కోసం పారదర్శకంగా వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సింగరేణి భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సింగిరెడ్డిపల్లె వాసుల వినతి



**ప్రజా వాయిస్ రామగిరి :** సింగరేణి ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోయిన తమ సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని పెద్దపల్లి జిల్లా, రామగిరి మండలం, జల్లారం పంచాయతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లె భూనిర్వాసితులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సింగరేణి సంస్థ ఆర్జీ –1 జీడికె 11 ఇంక్లైన్ ప్రాజెక్టు కోసం భూములు, ఇండ్లు కోల్పోయిన నాటి నుండి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఎక్స్‌గ్రేషియా విషయంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఎక్స్‌గ్రేషియా నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి. పక్క గ్రామలైన రచ్చపల్లి, లద్నాపూర్, అడ్రియాల గ్రామాలలో 2022 నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు చెల్లించిన విధంగానే, సింగిరెడ్డిపల్లె భూనిర్వాసితులకు కూడా రూ. 3,75,000/– చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలి. గ్రామానికి చెందిన వ్యవసాయ భూములు సింగరేణివి లేదా ప్రభుత్వ భూములు కావు కాబట్టి, ఆర్‌అండ్‌ఆర్ గెజిట్‌లో నమోదైన 43 మంది సింగరేణి కార్మికులకు పూర్తి స్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. రెవెన్యూ అధికారుల పొరపాటు వల్ల సింగిరెడ్డిపల్లె (హామ్లెట్ ఆఫ్ జల్లారం), చందనాపూర్ గ్రామాల్లో ఇండ్లు ఉన్నప్పటికీ గెజిట్‌లో పేర్లు నమోదు కాని వారికి రీ–సర్వే ద్వారా పూర్తి ప్యాకేజీ అందజేయాలి. ఇండ్లు, భూములు కోల్పోయిన కుటుంబాలకు జీడీకే ఓసీపీ–5 నందు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణమే ప్లాట్లు కేటాయించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలి. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించి భూనిర్వాసిత కుటుంబాలను ఆదుకోవాలని సింగిరెడ్డిపల్లె గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

## అనంతగిరిలో కబడ్డీకి కొత్త కమిటీ

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం..క్రీడాభివృద్ధికి కృషి




**ప్రజా వాయిస్, అనంతగిరి:** అనంతగిరి మండలంలో కబడ్డీ క్రీడకు కొత్త ఊపు రానుంది. జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ విస్తరణలో భాగంగా మండల కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా, రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.అధ్యక్షుడిగా మట్టపల్లి సతీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సిలివేరు శ్రీనివాస్, కోశాధికారిగా మట్టపల్లి సైదులుగౌడ్ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా అయితనబోయిన ధనమూర్తి, ఉపాధ్యక్షులుగా బెక్కం చంద్రరావు, ఆరె రవి, సహాయ కార్యదర్శిగా ఆరేళ్ల నరసింహ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ మండలంలోని కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీస్తామని తెలిపారు.ప్రతిభావంతులైన క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు. అనంతగిరి మండలంలో కబడ్డీ క్రీడ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## డిసిసి వైస్ ప్రెసిడెంట్ గా గుడి వంశీధర్ రెడ్డి



**ప్రజా వాయిస్/జనగామ జిల్లా :** జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు లకావత్ ధనవంతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య తో పాటుగా హాజరై డిసిసి వైస్ ప్రెసిడెంట్ గుడి వంశీధర్ రెడ్డి తన యొక్క పదవీ బాధ్యతలకు ప్రమాణ స్వీకారం చేశారు. వారితోపాటుగా జిల్లా కార్యవర్గం మరియు మండలానికి చెందిన పార్టీ నేతలు హాజరయ్యారు.

## ప్రజా వీరుడు పండుగ సాయన్న

- పెత్తందారి వ్యవస్థ పై పోరాటం చేసిన పండుగల సాయన్న జయంతిని ఘనంగా నివాళులు



**ప్రజావాయిస్, తలకొండపల్లి:** ముదిరాజ్ ముద్దు బిడ్డ పండుగ సాయన్న జయంతిని రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్, ముదిరాజ్ గ్రామ అధ్యక్షుడు రమేష్, మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం పోరాడిన గొప్ప మహనీయుడు పండుగల సాయన్న ప్రజలందరికీ సమన్య న్యాయం మహిళల సురక్షత కోసం అలకరుగని పోరాటం చేసిన వ్యక్తి పండుగల సాయన్న జయంతి జరుపుకోవడం ప్రతి ఒక్క పౌరుడు అక్కని తెలిపారు. కులాల మతాల మధ్య సకత కోసం అలపెరుగని పోరాటం చేసిన ఆ మహనీయునికి ధన నివాళులు అర్పించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ రాజశేఖర్, శ్రీను, రేణురెడ్డి ,మల్లేష్ గ్రామ పెద్దలు టి చంద్రశేఖర్ రెడ్డి,మల్లయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొనడం జరిగింది.పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటు కొరకు స్థలం కేటాయించాలని సర్పంచ్ కు వినతి పత్రం అందజేశారు.

## కేంద్ర ప్రభుత్వ పాసిస్ట్ పెట్టుబడిదారి వ్యవస్థకు ఘోరీ కట్టాలి

- సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- హసన్ పర్తి మండలానికి చేరుకున్న సిపిఐ పాదయాత్ర




**ప్రజా వాయిస్ హన్మకొండ /హసన్పర్తి :** దేశంలో మోడీ అధికారంలోకి వచ్చి పేద ప్రజల వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శనివారం హసన్ పర్తి మండల కేంద్రానికి చేరుకున్న సిపిఐ ప్రచార జాతాలో హసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదాన్ని మోపుతూ ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. 200 లక్షల కోట్ల అప్పుచేసి దేశ సంపదను పెట్టుబడిదారీ వర్గానికి దోచిపెట్టడానికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత, కార్మిక వర్గం తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వికసిత భారత్ పేరుతో విభజన భారత్ ను తయారు చేస్తున్నారని తెలిపారు. విద్య వైద్యం ఉపాధి ఉద్యోగాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రజాస్వామ్యాన్ని భారత రాజ్యాంగాన్ని రక్షించుకొనుటకు మరో స్వాతంత్ర పోరాటానికి సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాలు రైతు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వంన్ని డిమాండ్ చేశారు. ఈనెల 14 వరకు జాతాలను కొనసాగించి సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మందితో మహా ధర్నా నిర్వహించి మోడీ ప్రభుత్వాన్ని దిగి వచ్చేలా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాత కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి,బీకేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, ఎన్‌పి స్టాలిన్,ఊట్కూరు రాములు కర్రే లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, నాయకులు రాజ్ కుమార్, షేక్ బాబు, లక్ష్మయ్య, ప్రవీణ్, మాదాసి బాబు, రాసమల్ల దీన, రాజమణి, మంగ, మమత తదితరులు పాల్గొన్నారు.

## 10 న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- భానోత్ సీతారాం నాయక్
- సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి



**ప్రజా వాయిస్ , మహబూబాబాద్ :** పట్టణంలోని మల్లు స్వరాజ్యం నగర్ కాలనిలో జనరల్ బాడీ సమావేశాము కుంచపు మహేందర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాల ని రైతు మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మార్పు బి బి జి రామ్ పథకాన్ని తీసుకు రావడం జరిగింది దీనివలన గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిదురిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతమే ఇచ్చేవారు కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40% ఇవ్వాలని చెప్పడం జరుగుతుంది దీనివలన ఉపాధి హామీ పని రద్దు చేయాలనే యోజనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నాదని అన్నారు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో కూడా ఉచితలను తీసేవేసే జీవోలు తీసుకురావడం జరిగిందని అన్నారు ప్రభుత్వం ఆ జీవోలను కూడా రద్దు చేయాలని అన్నారు బిజెపి తీసుకొచ్చిన కార్మిక కర్షక రైతు ప్రజా వ్యతిరేక చట్టాలని తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికీ పెన్షన్స్.ఇందిరమ్మ ఇండ్లు.ఇంటి పట్టాలు.ఇండ్ల స్థలాలు. రైతులు రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూమికి పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ తో మహబూబాబాద్ లో వివేకానంద సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు వెలది మందితో జరిగే భారీ జైలు భరో కార్యక్రమంలో కార్మికులు కర్షకులు రైతు కూలీలు విద్యార్థులు ప్రజలు కాలనీవాసులు ఈ కార్యక్రమంలో సి పి యం పార్టీ పట్టణ కార్యదర్శులకు సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న శాఖ కార్యదర్శులు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- మేడ్చల్ అర్బన్ జిల్లా చేనేత సెల్ కన్వీనర్‌గా కంది శ్రీరాములు



**ప్రజా వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్: వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్స్‌లో నిర్వహించిన చేనేత దినోత్సవ సభలో కంది శ్రీరాములు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా చేనేత సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావు ఆదేశాల మేరకు రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్ కర్నాటి ధనంజయ ఈ నియామకం చేపట్టారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్‌కు కంది శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు కార్మికులకు మార్కెట్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. తన నియామకాన్ని పురస్కరించుకుని అభినందించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, చేనేత రంగ ప్రముఖులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు కంది శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు.

## బడికి కొత్త కళ.. విద్యార్థులకు నీటి భరోసా

- వెంకట్రాంపురం ప్రైమరీ స్కూల్‌కు రూ.లక్ష విలువైన సౌకర్యాలు
- పాఠశాలకు కొత్త రంగులు
- విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ గోకరాజు రంగరాజు స్ట్రీట్ కాజ్ సంస్థకు గ్రామస్తుల అభినందనలు




**ప్రజా వాయిస్, అనంతగిరి:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని వెంకట్రాంపురం ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన గోకరాజు రంగరాజు స్ట్రీట్ కాజ్ సంస్థ సుమారు రూ.లక్ష విలువైన సౌకర్యాలను సమకూర్చింది.పాఠశాల భవనానికి కొత్తగా రంగులు వేయించడంతో పాటు విద్యార్థుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీంతో పాఠశాల ఆవరణకు కొత్త రూపు రావడంతో పాటు విద్యార్థులకు తాగునీటి సమస్య తీరనుంది.ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో సంస్థ ప్రతినిధులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. సంస్థకు చెందిన కళాశాల విద్యార్థులు కార్యక్రమానికి హాజరై సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజికవేత్తలు, విద్యావంతులు పాల్గొని సంస్థ సేవలను అభినందించారు.విద్యార్థుల అవసరాలను గుర్తించి పాఠశాలకు రంగులు వేయించడం, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడం మంచి కార్యక్రమమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడతాయని వారు తెలిపారు.

## ముప్పారం గ్రామ సభలో చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ

- వితంతువులు ఒంటరి మహిళలకు 100% మంజూరు చేయాలి.
- అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన ధ్రువ పాత్రలు విధివిధానాలను ఫ్లెక్సీ రూపంలో పెట్టాలి.
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి..



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి :** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణపై ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. చేయూత పెన్షన్ దరఖాస్తుదారులుదరఖాస్తు చేసుకోవాల్సిన విధానం, అందుకు సంబంధించిన విధివిధానాలపై స్థానిక సర్పంచ్ గుంటిపల్లి రేణుక మరియు గ్రామ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగాజిల్లాలోనే మొట్ట మొదటి చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణనను ప్రారంభించారు.
చేయూత పెన్షన్ ముఖ్యంగా వితంతువులు, ఒంటరి మహిళలకు వంద శాతం మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ని కోరినట్లు తెలిపారు. కావున వితంతువులు, ఒంటరి మహిళల పెన్షన్లను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. చేయూత పెన్షన్లు వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీతా కార్మికులు, చేనేతకారులు, డయాలసిస్, ఫైలేరియా వ్యాధి గ్రాస్తులైన అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సిన ధ్రువ పత్రాలు, మరియు విధి విధానాలను ఫ్లెక్సీ రూపంలో గ్రామ కూడళ్లలో ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో ప్రతీ ఒక్కరికీ తెలిసే విధంగా దండోరా వేయించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరు కూడా చేయూత పెన్షన్ దరఖాస్తు చేసుకోవడంలో మిస్ కాకుకాడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చేయూత పెన్షన్లను అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
అనంతరం ముప్పారం గ్రామ ఉప సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి తల్లి తాళ్లపెల్లి వరమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ముప్పారం గ్రామానికి చెందిన ఆర్.ఎం.పి డాక్టర్ శ్రీరాముల వెంకటేశ్వర్లు తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుంటిపల్లి రేణుక, మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యంలో లెజెండ్ గద్దరన్న

- గద్దర్ వర్ధంతి సభలో జన నాట్యమండలి నాయకుడు సంజీవ్
- హనుమకొండలో ఘనంగా గద్దర్ వర్ధంతి సభ




**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి :** జనం సమస్యలకు జనం బాషను, జనం యాసను, భౌతికవాదాన్ని జోడించి సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిన గొప్ప కవి, కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ సాహిత్యంలో లెజెండ్ అని జననాట్యమండలి నాయకుడు సంజీవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్ లో గద్దర్ గళం ఆధ్వర్యంలో విసికె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. తరతరాలుగా దేశంలో జరుగుతున్న దోపిడి, దేశ భూస్వామ్య, పాలకుల దోపిడీకి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ తోడై దోపిడి ఎలా కొనసాగిందో, ఆ దోపిడిలో చిక్కుకున్న ప్రజలు ఎలా విలవిలలాడారో గద్దర్ ప్రతి పాటలో కనపడుతుందని అన్నారు. ప్రజల అజ్ఞానం, మూఢనమ్మకాలు, పాలకుల దోపిడి, పోలీసుల ప్రవర్తనపై ప్రజల బాషలో, పలు భాషల్లో పాడి ప్రజలను చైతన్యం చేసి ప్రజా యుద్ధానికి సిద్ధం చేసిన యుద్ధ నౌక గద్దర్ ప్రపంచంలోనే గొప్పవాడని అన్నారు. గద్దర్ అజ్ఞాతంలో ఉన్నపుడు అన్న కోసం మూడు సంవత్సరాలు ఆటో నడిపి గద్దరన్నను సాధుకున్నట్లు ఆవేదనతో మాట్లాడాడు. సాంస్కృతిక ఉద్యమంలో నిర్మాణాత్మకమైన సమస్యల గురించి గద్దర్ వ్రాశాడని, సామ్రాజ్యవాదం గురించి, అమెరికా దోపిడి గురించి రచించి పాడిన గద్దర్ కార్మికులు., కర్షకులు , మహిళల గురించి, కూలీల , తల్లుల త్యాగం , విద్యార్థుల త్యాగాల గురించి ఏ వర్గాన్ని కూడా విస్మరించకుండా చైతన్యపరిచి తన జీవితాంతం పోరాటం చేశాడని అన్నారు. ఆయా వర్గాల సమస్యలపై, ప్రజల విముక్తికై గద్దరన్న పాడిన పాటలను సంజీవన్న పాడి సభను ఉత్తేజపరిచారు.
డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యూడలిజంతో ప్రజాస్వామిక చర్చలు సాధ్యం కావని, అందుకే పీడిత వర్గాలు విప్లవించాయని . గద్దర్ గళం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ పాలకులు గద్దర్ పేరును మాత్రమే వాడుకుంటున్నాయని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని విమర్శించారు. యశపాల్ మాట్లాడుతూ జనపదాలను విప్లవీకరించాలనే లక్ష్యంతో గద్దర్ అద్భుతమైన పాటలు రాశాడని వివరించారు. గద్దర్ పేరుతో ఒక సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. గద్దర్ విగ్రహాన్ని హన్మకొండలో ఏర్పాటు చేయాలని ప్రొ. తిరునహరి శేషు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎగ్గడి సుందర్ రామ్ స్వాగతం పలుకగా సిపిఎం నాయకులు చుక్కయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు రమక్క, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లన్న, అసంఘటిత కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు నలిగింటి చంద్రమౌళి, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, డాక్టర్ మంద వీరస్వామి, తెలంగాణ శ్యాం, సీనియర్ న్యాయవాదులు పులి సత్యనారాయణ, రామస్వామి, షేక్ అబ్దుల్ నబీ, విలాసాగరం సురేందర్ గౌడ్, బండి మొగిలి, సారంగపాణి, రాచకొండ ప్రవీణ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు వలి ఉల్లా ఖాద్రీ, నున్న అప్పారావు, నరోత్తమ్ సూరీ, డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, కోండ్ర నరింగరావు, దూడల సాంబయ్య, సింగారపు అరుణ న్యాయవాదులు గురిమిల్ల రాజు, ప్రభంజన్, రాజేందర్, చెరిపెల్లి ఆనంద్, కామ్రేడ్ వివిధ సంఘాల నాయకులు. కవులు. కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం....

- కాంగ్రెస్‌లో నూతన నియామకాలు.
- కొత్త బాధ్యతలు చేపట్టిన నాయకులకు అభినందనలు
- యశస్విని రెడ్డి, కడియం కావ్య, లకావత్ ధన్వంతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందాజేత.



**ప్రజా వాయిస్ / పాలకుర్తి :** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీలో నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి చేతుల మీదుగా జిల్లా కేంద్రంలో నూతనంగా నియమితులైన నాయకులు నియామక పత్రాలను స్వీకరించారు. దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దావెర అనిల్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉప్పుల సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులుగా తోటకూరి పాండు కృష్ణ, బానోత్ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మహమ్మద్ షబ్బీర్ అలీ, సురంజన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్మవారికి అంగరంగ వైభవంగా బోనాలు

- మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు
- బైండ్ల వారి నృత్యాలు, పూనాకాల, యువకుల కేరింతలతో ఊరేగింపు



**మిరుదొడ్డి, ప్రజా వాయిస్ :** ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మిరుదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా బోనాల మహోత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనగా, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అమ్మవారి విశేష అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పురోహితులు రాజపున్నయ్య శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, కుంకుమార్చన, సహస్రనామార్చన, అమ్మవారి మహా అలంకరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పూలతో, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించగా ఆలయ ప్రాంగణం భక్తి శోభతో కళకళలాడింది. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, మహిళా సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో మంగళ వాయిద్యాలు, భక్తి గీతాలు మార్మోగడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
అనంతరం మహిళలు సంప్రదాయ బోనాలను తలపై ధరించి గ్రామ వీధుల్లో భారీ శోభాయాత్రగా తీసుకెళ్లారు. డప్పు చప్పుళ్లు, తాషా మేళాలు, బైండ్ల వారి సంప్రదాయ నృత్యాలు, పూనాకాలు, యువకుల కేరింతలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత ఉత్సాహంగా పాల్గొని బోనాల ఊరేగింపును మరింత వైభవంగా మార్చింది. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. మహిళలు రంగురంగుల చీరల్లో, యువకులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడంతో ఊరేగింపు ఆకట్టుకుంది.
బోనాల సందర్భంగా ఆలయ కమిటీ మరియు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, ప్రసాదం, అన్న దాన,ఇతర సౌకర్యాలు కల్పించారు. భక్తుల రద్దీ దృష్ట్యా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి సంవత్సరం ఇదే భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పంటలాభాలు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న దొంగలు



**ప్రజా వాయిస్, ఐనవోలు:** కన్నేశారా చోరీ చేయాల్సిందే. కటిక చీకట్లలోనూ కాపర్ కొట్టేయాల్సిందే. కాదూ కూడదంటే విద్యుత్ వైర్లనయినా దిగమింగేయాల్సిందే. ప్రాణాంతకమని తెలిసినా విద్యుత్ వైర్లతో సయ్యాటలాడతారు. అర్ధరాత్రి మొదలు కోడి కూసే లోపు గప్‌చుప్‌గా ఎత్తుకుపోతారు.వర్షాలు లేక రైతులు అవస్థలు పడుతుంటే మరో సమస్య కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. దొంగలు పొలాల్లోని మోటర్లకు సంబంధించిన కాపర్ వైర్లను అపహరిస్తున్నారు.మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో వ్యవసాయ బావుల వద్ద వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట దొంగలిస్తుండడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైర్లను దొంగలించడంతో సమయానికి నీరు అందక పంటలు దెబ్బతింటున్న రైతులు వాపోతున్నారు.పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మంత్రులకు పలు సమస్యలపై వినతి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**ప్రజా వాయిస్ ,హుజూరాబాద్ :** హైదరాబాద్ సచివాలయంలో జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని, నియోజకవర్గ సమస్యలపై మంత్రులకు వినతిపత్రం సమర్పించారు. సాగు, తాగునీటి కోసం కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలని, కాల్వల ప్రాజెక్టుకు రూ.70 కోట్లు, ఇల్లంతకుంట రామాలయానికి రూ.30 కోట్లు, కమలాపూర్ ఆలయానికి రూ.25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. వీణవంక రోడ్డు పనులు, హుజూరాబాద్–జమ్మికుంట మున్సిపల్ పనులను వేగవంతం చేయాలని, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ట్రాక్టర్లకు ఉచిత అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దళితబంధు 2వ విడత నిధులు, ఇందిరమ్మ ఇళ్లు, నివాస పట్టాల పునరుద్ధరణతో పాటు జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎమ్మెల్యే మంత్రులను కోరగా, వారు సానుకూలంగా స్పందించారు.

## ఘనపూర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తా.....

- 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందాలంటే కేనాల్స్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది.....
- పంట కాలువలలో డ్రైనేజీ నీరు కలువకుండా వెంటనే డ్రైనేజిలను రీడిజైన్ చేయాలి....
- నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్ల నుండి ఆగస్టు 14న పంటలకు సాగు నీరు విడుదల చేస్తాం...
- ఆగస్టు 14నుండి 15రోజుల పాటు నీటి విడుదల జరుగుతుంది.
- ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీటి విడుదల జరుగుతుంది.
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజా వాయిస్/స్టేషన్ ఘనపూర్ :** ఏది ఏమైనా ఆగస్టు 14నుండి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని దేవాదుల రిజర్వాయర్ల ద్వారా పంటలకు సాగు నీరు విడుదల చేసి తీరుతామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ కుడి కాలువను నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎస్సి కాలనీ నుండి వెళ్తున్న పంట కాలువను, తూము వద్ద కాలువను, పలు కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పంట కాలువలో మురుగు నీరు చేరడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మురుగు నీరు పంట కాలువలో చేరకుండా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పంటల కాలువకు రెండు వైపులా సైడ్ వాల్స్ నిర్మాణం చేసి చివరి వరకు సాగు నీరు వెళ్లే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం రెండు మూడు రోజులలో సాగు నీరు అందించేందుకు వెంటనే కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. 3 నెలలలో శాశ్వత కెనాల్ నిర్మాణానికిసంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వెల్లడించారు. మున్సిపాలిటీ డ్రైనేజి నీరు పంట కాలువలలో చేరకుండా మున్సిపల్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో డ్రైనేజిలు, వరద కాలువలు, పంట కాలువల నిర్మాణం చేయాలని ఆదేశించారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.... దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 1.5 టీఎంసిల సామర్థ్యంతో ఘనపూర్ రిజర్వాయర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఘనపూర్ రిజర్వాయర్ కింద సుమారు 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాల్సి ఉందని కానీ కెనాల్స్ ఆధునికరించకపోవడం వల్ల పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదని తెలిపారు. రిజర్వాయర్ కింద ఉన్న 2,500 ఎకరాలకు సాగు నీరు అందాలంటే చివరి వరకు కెనాల్స్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను నీటి పారుదల శాఖ అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు.

మున్సిపాలిటీకి సంబంధించిన మురుగు నీరు పంట కాలువలలోకి రాకుండా డ్రైనేజిల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇప్పటికే కొన్ని డ్రైనేజీలు, వరద కాలువలకు టెండర్లు పూర్తి అయ్యాయని ఇంకా ఎక్కడెక్కడ డ్రైనేజి నీరు పంట కాలువలలో కలుస్తుందో అక్కడ డ్రైనేజిల రీడిజైన్ చేయాలని తెలిపారు. అందుకు మున్సిపాలిటీ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. వరద నీరు, మురుగు నీరు పంట కాలువలో కలవకుండా వాగులో కలిసే విధంగా డ్రైనేజిల నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పంటలకు సాగు నీరు ఇచ్చేందుకు వెంటనే పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేసి మూడు రోజులలో పంటలకు సాగు నీరు అందించాలని స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలం వరకు పూర్తి స్థాయిలో కెనాల్స్ నిర్మాణం చేసి ఘనపూర్ రిజర్వాయర్ ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలే ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డయని అన్నారు. దింతో ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడుతూ, అధికారులను సమన్వయం చేస్తూ రైతులకు సాగు నీరు అందెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, అశ్వరావుపల్లి, గండి రామారం, నవాబ్ పేట రిజర్వాయర్లలో నీటి నిలువలు పెంచి అందుబాటులో ఉన్న నీటితో సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆగస్టు 14న నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్ల నుండి రైతులకు సాగు నీరు విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 14నుండి 15రోజుల పాటు నీటి విడుదల జరుగుతుందని మరో 15రోజుల పాటు మళ్ళీ రిజర్వాయర్లలో నీటిని నింపనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిరంతరాయంగా నీటి విడుదల సాధ్యం కాదని అందుకని ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగు నీటి విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ ఆన్ అండ్ ఆఫ్ పద్ధతికి సహకరిస్తూ కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈలు, డిఈలు, మున్సిపాలిటీ అధికారులు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ప్రాణాలకు భద్రత ఎక్కడ?
# బార్‌గేట్లతో ఇరుకుగా మారిన నేషనల్ హైవే...

- షిఫ్టు ముగించుకొని వస్తున్న వేల భారీగా వాహనాల రద్దీ...
- వేగంగా వస్తున్న భారీ వాహనాలు ఢీ కొట్టి ఐటీసీ కార్మికులు మృత్యువాత పడుతున్న వైనం...
- లారీ ఢీ కొట్టి మరో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి...
- నిద్ర అవస్థలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు...
- ప్రాణాలు పోతున్న నేషనల్ హైవే పై భారీగేట్స్ తొలగించని పరిస్థితులు...
- ప్రజా వాయిస్ లో భారిగేట్స్ వల్ల ప్రమాదం పొంచి ఉందని కథనాలు వచ్చిన పట్టించుకోని అధికారులు, ఐటిసి యాజమాన్యం...



**ప్రజా వాయిస్, బూర్గుంపాడు :** సారపాకలోని ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారం ప్రధాన గేటు వద్ద మరో విషాదం చోటుచేసుకుంది. ఐటీసీలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై బయటకు వస్తున్న సమయంలో లారీ ఢీకొనడంతో అంబికా ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్ట్ ఉద్యోగి, పీఎం–5 మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న జి. శ్రీరామ్ శుక్రవారం సాయంత్రం మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. సారపాకకు చెందిన శ్రీరామ్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, సహచర కార్మికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

**మృతదేహంతో ఐటీసీ గేటు ముందు ధర్నా...**

శ్రీరామ్ మృతదేహాన్ని ఐటీసీ ప్రధాన గేటు వద్ద ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని, తగిన పరిహారం అందించాలని, కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.గతంలో మృతుల కుటుంబాలకు న్యాయం చేశారు. మాకు ఎందుకు చేయరు?" అంటూ కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పడంతో ఐటీసీ గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.ధర్నాకు సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ సంఘీభావం తెలిపారు. ఐటీసీ గేటు వద్ద ఉంచిన శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన పరిహారం, భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

**ఐటీసీ కార్మికులకు భద్రత ఎక్కడ ??**

ఐటీసీ ప్రధాన గేటు వద్ద మరో కీలక సమస్య కార్మికుల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోందని స్థానికులు చెబుతున్నారు. కర్మాగారం నుంచి షిఫ్ట్ ముగించుకుని బయటకు వచ్చిన కార్మికులు తమ ద్విచక్ర వాహనాలను తీసుకోవడానికి జాతీయ రహదారిని దాటి మరోవైపు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వారు పేర్కొంటున్నారు. హైవేకు ఇరువైపులా కార్మికుల ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉండటంతో, కర్మాగారం నుంచి బయటకు వచ్చిన కార్మికులు రహదారి దాటి వాహనాల వద్దకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. ఆ వాహనాలు తీసుకొని నేరుగా హైవే మీదకు ఎక్కాల్సి వస్తుందని వారు తెలిపారు.అదే సమయంలో హైవేపై భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో ఒకేసారి పెద్ద సంఖ్యలో కార్మికులు రహదారి దాటడం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయాన్ని కలిగించడంతో పాటు ప్రమాదాల ముప్పును పెంచుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇది ఒక్కరోజు సమస్య కాదని, గతంలో కూడా ఈ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న కార్మికులు, వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలుచోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయినప్పటికీ కార్మికులు సురక్షితంగా రహదారి దాటేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంపై వారు ప్రశ్నలు సంధిస్తున్నారు.


ప్రజా వాయిస్
నేషనల్ హై వే ఆక్రమణ



**నేషనల్ హైవేపై భారీ గేట్లు ఏర్పాటు... షిఫ్ట్ వేళ రద్దీతో అవస్థలు...**

కాంట్రాక్ట్ కార్మికుల ద్విచక్ర వాహనాలను జాతీయ రహదారికి ఇరువైపులా ఐటీసీ ఏర్పరిచిన షెడ్లలో పార్కింగ్ చేయడం వల్ల షిఫ్ట్ మారే సమయంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. షిఫ్టు మారే టైంలో ఒకేసారి వందలాది మంది కార్మికులు బయటకు రావడం,రహదారి దాటడం,
తమ వాహనాలను తీసుకుని తిరిగి రోడ్డుపైకి రావడం.అదే సమయంలో భారిగేట్స్ ను తప్పించబోయి అదుపు తప్పి ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడం తో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి యి దీనితో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

**నిద్రావస్తలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు...**

ఐటీసీ ప్రధాన గేటు పరిసరాల్లో గతంలో కూడా పలుమార్లు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. రహదారి దాటే సమయంలో, షిఫ్ట్ మారే సమయంలో, భారీ వాహనాల రాకపోకల మధ్య పలువురు ప్రమాదాలకు గురయ్యారని వారు పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన ప్రతిసారి కొంతకాలం చర్చ జరగడం తప్ప, ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాఫిక్ పరిస్థితులపై శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు పరిశ్రమలో వేలాది మంది కార్మికులు పనిచేస్తుండగా, మరోవైపు వారి రాకపోకలు నేరుగా జాతీయ రహదారితో ముడిపడి ఉంటే, వారి భద్రత కోసం ప్రత్యేక ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. నేషనల్ హైవే పై నిబంధనలకు విరుద్ధంగా ఐటీసీ యాజమాన్యం
భారీగేట్స్ ఎలా ఏర్పాటు చేస్తారని తరచు ప్రమాదాలు జరుగుతున్న ఆర్ అండ్ బి శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని కార్మికులు స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీరామ్ కుటుంబానికి న్యాయం చేయాలి...**

తాజా ప్రమాదంలో శ్రీరామ్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మృతదేహంతో ధర్నాకు దిగారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. గతంలో మృతుల కుటుంబాలకు న్యాయం చేసినట్లే తమ కుటుంబానికి కూడా తగిన పరిహారం, భరోసా కల్పించాలని కోరారు.అదేవిధంగా ఐటీసీ గేటు వద్ద పార్కింగ్, షిఫ్ట్ వేళ ట్రాఫిక్ రద్దీ, కార్మికులు రహదారి దాటే పరిస్థితి, బార్‌గేట్లతో తగ్గుతున్న రహదారి స్థలం వంటి అంశాలను అధికారులు పరిశీలించి శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజా వాయిస్ కథనాలు అక్షర సత్యం...**

ఐ టి సి కర్మాగారం నేషనల్ హైవే ప్రధాన రహదారిపై భారీగేట్స్ ఏర్పాటు చేయడం వల్ల కార్మికుల ప్రాణాలకు, వాహనదారుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ప్రజా వాయిస్ దినపత్రికలో అనేకమార్లు వరుస కథనాలు ప్రచురితం చేసిన కానీ సంబంధిత అధికారులు తో పాటు ఐటీసీ యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణి చూపించడం తో ప్రమాదాలు చోటు చేసుకోవడంతోపాటు అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇప్పటికైనా, జిల్లా కలెక్టర్ స్పందించి నేషనల్ హైవే పై ఏర్పాటు చేసిన భారీ గేట్స్ ని తొలగించాలని స్థానిక ప్రజలతో పాటు వాహనదారులు కోరుకుంటున్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

- కార్పొరేట్లకు కట్టబెడుతున్న బీజేపీ
- చాడ వెంకటరెడ్డి మండిపాటు

**ప్రజా వాయిస్ చిగురుమామిడి :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్లకు అప్పగిస్తోందని సీపీఐ సీనియర్ నాయకుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉపాధి, అభివృద్ధి హామీలను ప్రధాని మోదీ విస్మరించారని విమర్శించారు. మోయలేని ధరలు యువతలో ఆందోళన గ్యాస్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. నిరుద్యోగం వల్ల యువత భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నమ్మకద్రోహం కనీస మద్దతు ధర (ఎమ్ఎస్పీ) చట్టం తెస్తామన్న హామీని ప్రధాని ఇప్పటివరకు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. పంటలకు మద్దతు ధర చట్టం తెచ్చి, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేసి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో సాగిన సీపీఐ ప్రచార జాతరకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పంజాల శ్రీనివాస్, నాగేల్లి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# సాటాపూర్ వారపు సంతలో చినుకు పడితే చిత్తడే!

- ప్రతి శనివారం జరిగే వరపు సంతకు వేలాదిగా జనం.. ఎద్దుల అంగడి, కూరగాయల మార్కెట్‌కు వసతులు కరువు
- వర్షం పడితే బురదమయం.. ఆ బురదలోనే కూరగాయల విక్రయాలు.. ప్రజారోగ్యంపై ఆందోళన



**సాటాపూర్, ప్రజావాయిస్:** సాటాపూర్‌లో ప్రతి శనివారం జరిగే వారపు సంతకు పరిసర గ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఎద్దుల అంగడితో పాటు కూరగాయలు, నిత్యావసర వస్తువుల విక్రయాలతో శనివారం సంత సందడిగా ఉంటుంది. అయితే వర్షాకాలం వచ్చిందంటే ఈ సంతకు వచ్చే ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

సంత ప్రాంగణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు, నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారీ బురద, నీటి నిల్వలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు, వ్యాపారులు తమ సరుకులను తీసుకురావడం, విక్రయించడం కష్టంగా మారుతోంది.

**బురదలోనే కూరగాయల వ్యాపారం**

ప్రతి శనివారం సంతలో పెద్ద సంఖ్యలో కూరగాయల వ్యాపారులు తమ సరుకులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వర్షం కారణంగా నేల బురదగా మారిన సమయంలో కూడా కూరగాయల అమ్మకాలు కొనసాగుతున్నాయి.

కూరగాయలు బురద, కలుషిత నీటికి గురైతే వాటి పరిశుభ్రత దెబ్బతినే అవకాశం ఉంది. వాటిని సరిగా శుభ్రపరచకుండా వినియోగిస్తే విరేచనాలు, వాంతులు, కడుపు సంబంధిత ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కలుషిత ఆహారం లేదా నీటి ద్వారా కొన్ని అంటువ్యాధులు వ్యాపించే అవకాశం కూడా ఉండటంతో మార్కెట్ పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**పశువుల అంగడితో రద్దీ మరింత**

సాటాపూర్ ఎద్దుల అంగడికి కూడా రైతులు, పశువుల వ్యాపారులు తరలివస్తుంటారు. పశువులు, వాహనాలు, ప్రజల రాకపోకలతో సంత ప్రాంతం రద్దీగా ఉంటుంది. వర్షం పడినప్పుడు బురదలో వాహనాల రాకపోకలు కూడా కష్టంగా మారుతున్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు బురదలో నడవాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం కూడా ఉంది.



**వారపు సంతకు శాశ్వత వసతులు ఎప్పుడు?**

ప్రతి శనివారం నిర్వహించే వారపు సంత ద్వారా రైతులు, వ్యాపారులకు వ్యాపార అవకాశాలు లభిస్తుండగా.. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఒకే చోట కూరగాయలు, పశువులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసే అవకాశం లభిస్తోంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న సంతకు మాత్రం కనీస మౌలిక వసతులు లేకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంత ప్రాంగణానికి సీసీ రోడ్లు లేదా పేవర్ బ్లాక్స్, శాశ్వత డ్రైనేజీ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, చెత్త నిర్వహణ, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని రైతులు, వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. ప్రతి శనివారం వేలాది మంది రాకపోకలు సాగించే సాటాపూర్ వారపు సంతకు ఇకనైనా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రజావాయిస్ ప్రశ్న?**

ప్రతి శనివారం సంతకు వచ్చే ప్రజల నుంచి ఆదాయం తీసుకుంటున్నప్పుడు.. వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం?
వర్షాకాలంలో బురద సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?

## జోరుగా మండల వ్యాప్తంగాకల్తీ కల్లు విక్రయం....

- పట్టించుకోని ఆప్కారి శాఖ....
- మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్న వైన్యం....
- ఇదే అదునుగా చేసుకొని ఇష్టారాజ్యంగా కల్తీ వ్యాపారం.....

**ప్రజా వాయిస్, పాపన్నపేట :**
పాపన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో జోరుగా కల్తీ కల్లు విక్రీయం జరుగుతున్నప్పటికీ సంబంధిత ఆప్కారి శాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కల్తీ కల్లుకు బానిసైన యువత కుటుంబాలలో గొడవలు పడుతూ ప్రాణాలు పోతున్నాయని ఆరోపణ పెట్టుకున్న సంబంధిత శాఖ పట్టించుకోకపోవడం వల్ల అధికార యంత్రం మామూళ్ల మత్తులో మునిగితేలుతుందని ఆరోపణలు వస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలు చూసి చూడనట్లు పోవడంతో కల్తీ కళ్ళు యజమానుదారులు ఇదే ఆసరాగా చేసుకొని జోరుగా డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని కల్తీకల్లును అరికట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

